ఆదివారం

ప్రజాశక్తి

మార్చి 20, 2005

సినిమాకు మాటలొచ్చి డెబ్బైనాలుగేళ్లు

20.3.2005నుంచి
26.3.2005వరకు

హ్యాపీ బర్త్ డే



వైష్ణవి
2సం॥, 20.3.2003
లావణ్య-శేఖర్‌బాబు
కందుకూరు-ప్రకాశం

దీక్షిత
1సం॥, 21.3.2004
యాదమ్మ-సత్తయ్య
జిల్లెలగూడ-రంగారెడ్డి

తన్మయి
1సం॥,21.3.2004
సుమలత-కృష్ణకుమార్
వనస్థలిపురం-హైదరాబాద్

సాత్విక
4సం॥, 22.3.2001
చంద్రకళ-వెంకట్రాంరెడ్డి
లక్షణచాంద-ఆదిలాబాద్

సాత్విక్‌రెడ్డి
1సం॥, 23.3.2004
పవిత్ర-ప్రవీణ్‌రెడ్డి
నిర్మల్-ఆదిలాబాద్

తాహెర్ హుస్సేన్
2సం॥, 24.3.2003
రుక్సానా-వాహిద్
ఆదోని-కర్నూలు

శివరామప్రసాద్
6సం॥, 25.3.1999
కల్పన-బాలకృష్ణ
నాగర్‌కర్నూలు-మ॥నగర్

కౌశిక్
10సం॥, 25.3.1995
ప్రమీల-పరమేశ్వరరెడ్డి
మార్కాపురం-ప్రకాశం

మేఘన
1సం॥, మార్చి,2004
హేమలత-రామారావునాయుడు
వెంకటరాజపురం-విజయనగరం

అనోష
1సం॥, మార్చి,2004
కల్పన-ఉమామహేశ్వరరావు
హైదరాబాద్

భానుశ్రీ-భాగ్యశ్రీ
హైమావతి-ప్రభాకర్
వేణుగోపాలపురం-చిత్తూరు

అభినయ్
2సం॥,మార్చి,2003
అనూరాధ-వెంకటేష్
నెల్లూరు

కథా నిలయం

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం



రోబోల గురించి

6వ తేదీ అనుబంధం కవర్‌స్టోరీగా "ఐ రోబో...నీ బాంచెన్ దొరో" చాలా ఆసక్తికరంగా ఉంది. సైన్స్ ఎంత అభివృద్ధి చెందింది అని ఆశ్చర్యపోవడం మా వంతయ్యింది. రోబో అనే పదం పుట్టుక, సోనీ కంపెనీ రకరకాల రోబోలను తయారుచేసి మార్కెట్టు చేస్తున్న వివరాలు చదివింపజేసింది. ఆపరేషన్‌లలో కూడా డాక్టర్ల చేతిపరికరంలాగా ఎంతో సున్నితమైన పనులు చేస్తున్నాయని తెలుసుకుని అబ్బురపడ్డాం. మంచి వ్యాసం అందించినందుకు ధన్యవాదాలు.

-పాలపర్తి రాజేష్,

రామచంద్రాపురం, తూర్పుగోదావరి

అన్ని శీర్షికలూ బాగున్నాయి

రోబో కవర్‌స్టోరీ మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకుంది. కార్టూన్‌లలో రైల్వే బడ్జెట్‌పై వేసినది మాకు నచ్చింది. 'పెళ్ళికౌన్సిల్' లో సరోజ స్టోరీ ఆలోచింపజేసింది. 'పావలాకే...రూపాయికైతే...' పదేపదే చదవాలనిపించింది. 'హోమం...బస్సు హోమం' ప్రతి ఒక్కరు చదివితే ప్రజాస్వామ్యంలో సమస్యలు అర్థం అవుతాయి. హెపటైటిస్-బి గురించి విపులంగా తెలియజేశారు. మెదళ్ళలో దొంగలు పడ్డారు అనే కవిత చాలా బాగుంది.

-విలియం కేరీ,

ఎంఆర్‌పి, పాడేరు, విశాఖ జిల్లా

ఏమున్నది గర్వకారణం

జీవనశైలి లో ఏమున్నది గర్వకారణంలో పదవులు ఆశించే రాజకీయ నాయకుల మనస్తత్వాలు, అసెంబ్లీ, పార్లమెంటులలో ఒకరిపై వేరొకరు చేసుకునే నిందారోపణలు, గుడ్డిగా నమ్మి ఓట్లు వేసే ఓటర్లకు దర్పణం. కుళ్ళు రాజకీయాల ప్రక్షాళనకు, ముగింపుకు యువతరం నడుం కట్టాలి.

-శైలజా సనత్, విశాఖపట్టణం.

పెళ్ళికౌన్సిల్

ఈ వారం ప్రచురించిన 'పెళ్ళికౌన్సిల్' అనే కథ చాలా బాగుంది. ఇలాంటి వాస్తవ జీవితాలను ఈనాటి యువతకు స్ఫూర్తినిచ్చేవిగా అందించాలని కోరుతున్నాం. ఇందులోని జీవనశైలి, కచేరి, కవర్‌స్టోరీ చదివినకొద్దీ చదవాలనిపించేవిగా ఉన్నాయి.

-అన్నే వెంకటకృష్ణారావు,

గన్నవరం, కృష్ణాజిల్లా

కథ బాగుంది

6వతేదీ పత్రికలో ప్రచురించిన పెళ్ళికౌన్సిల్ కథ నేటి జనజీవన విధానానికి అద్దం పడుతోంది. హెపటైటిస్-బి ఆరోగ్యవ్యాసం చాలా విజ్ఞానదాయకంగా ఉంది. కవర్‌పేజీ కలర్‌లో అలరిస్తోంది.

-బేరి మధుసూదన్, సునీత,

కర్నూల్

టూరిస్ట్‌గైడ్

ఆదివారం సంచికలోని గోదావరిలోయ ఆదిలాబాద్ అనే టూరిస్ట్ ప్రాంతం గురించి చదివాం. చాలా వివరాలు, దాని ప్రాముఖ్యత తెలిశాయి. ఉవ్వెత్తున ఎగిసిపడే జలపాతాలు, హోరున ప్రవహించే గోదావరి నదీ జలాలు గురించి బాగా రాశారు.

-ఆర్ రాజారత్నం,

గార్గేయపురం, కర్నూల్‌జిల్లా

కళాసేవ

నూతలపాటి వీరప్రకాశ్‌గారి కళాసేవ గురించి కళాసాహితిలో వేసిన ఐటమ్ ఆదర్శప్రాయంగా ఉంది. అధ్యాపకునిగా విద్యార్థులను అంకితభావంతో తీర్చిదిద్దుతూనే సామాజిక రంగంలోనూ, వికలాంగులను ఆదుకోవడంలోనూ అరుదైన పురస్కారం రావడం అయన సేవకు గుర్తింపు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఒకే సంవత్సరంలో నాలుగు అవార్డులు ఒకే వేదికపై అందుకోవడం అరుదైన అంశం. అంగవైకల్యం ఉన్నా సరే ఏదైనా సాధించ వచ్చు అనే దృక్పథం కల్పించిన ఘనాపాటి నూతలపాటి యువతరానికి ఆదర్శం.

-బుర్రి కుమార్‌రాజా, రత్నపురి కాలనీ,

గుంటూరు.

బాలలకోసం పేజీలు

చిన్నారి బాలలకోసం పేజీలు కేటాయించి మంచిమంచి కథలు ప్రచురిస్తున్నందుకు ధన్యవాదాలు. అనేక బొమ్మలు, పజిల్స్‌తో వారిలో విజ్ఞానాన్ని, వినోదాన్ని కలిగిస్తున్నందుకు సంతోషం.

-వాసాల నరసయ్య, మెట్పల్లి,

కరీంనగర్‌జిల్లా

రియల్‌స్టోరీ

ఈ వారం రియల్‌స్టోరీలో కుంజుమణి గురించి రాసినది బాగుంది. కష్టాల కడలిలో, బాధలను అధిగమించి, తన కాళ్ళమీద నిలబడిన ఆ వనిత ఎందరో మహిళలకు ఆదర్శం. మగపనివారికి ధీటుగా బిల్డింగ్ పెయింటింగ్ పనిలో మంచి నిష్ణాతురాలవ్వడం నిజంగా అభినందనీయం.

-మేడూరి సత్యనారాయణ,

ఖైరతాబాద్, హైదరాబాద్

పెద్దమనుషులంటేనే...

'పెద్దమనుషులంటేనే బుద్ధులన్ని వేరురా' అన్న పరమానందయ్య శిష్యులు ఒట్టిసుద్దమొద్దులని ఎవరన్నారు చెప్పండి?!

ఓ పెద్దమనిషి వచ్చి ఇలా కూర్చో... అనంటే వయస్సుని బట్టి అలా సంభోదించి మర్యాదిచ్చినట్లు. అలాంటి పెద్దమనుషుల వల్ల మనగ్గానీ, మన లోకానిగ్గానీ వచ్చిపడే సునామీ ఏమీలేదు.

పెద్దమనుషుల్లో పెట్టి నీ యవ్వారం తేల్చకపోతే నా పేరు ఫలానా పరమేశం కానేకాదు అన్నారనుకోండి. అప్పుడా మనుషులు పంచాయితీచేసి న్యాయం చేసేవారనుకుంటారు కదా!

కానీ ఆ పెద్ద అన్న విశేషాణాలంకృతులు తమ స్వార్థం కోసం పంచాయితీ చేస్తేనే మన పరమానందయ్యాస్ స్టూడెంట్స్ ఇచ్చిన కాంప్లిమెంట్ ఇంప్లిమెంట్ అయ్యేది మరి!

ఆ రకపు 'పెద్ద'మనుషులు ఆఫీసర్లుగా, సూపర్నెంటాఫ్ పోలీసాయనగా, జడ్జీలుగా రకరకాల హోదాల్లో ఉన్నారంటే ఇక చెప్పేదేముంది చెప్పండి!!

తొండలు ముదిరి ఊసరవెల్లి అవుతుందో లేదో గానీ ఈ రకపు పెద్ద మదుసులు ఇంకా పెద్దపెద్దోళ్ళయి గద్దెనెక్కే పెద్దలౌతున్నారు!!!

పెద్దమనుషులనేవారి బుద్ధుల్లోని మార్పులతో వాళ్లు మోస్తున్న పెద్ద అనే పదంలోని అర్థం కూడా మారిపోయింది.

మరంచేత... పెద్దమనుషులు అనంగానే ఎలాంటి పెద్దమనుషులో అనే సందేహం జెయింట్ సైజులో మనముందు తిష్టవేసుకుంటుంది.

ఓ వంచితురాలిపై చెయ్యివేసినవారిలో ఓ చెయ్యి పంచాయితీచేసే పెద్దల్లోనూ ఉందంటే, నెలసరి జీతంరాళ్ళు తీసుకుంటూనే అమ్యామ్యా శబ్దార్థ గీతంరాళ్ళు వెనకేసుకుంటుంటే, సాక్ష్యాలన్నీ మెండుగా ఉన్నా దండిగా పుచ్చుకుని కేసుని హరీమనిపించి సుత్తి దెబ్బ కొడితే పి నందయ్యగారి పిల్లకాయల మాట ముమ్మాటికీ నిజమనిపించదూ!!

అంతెందుకండి మహాప్రభో...మొన్నామధ్య బీహార్ ఎన్నికల్లో పోలింగ్ రోజున ఓ తెగ కష్టపడిపోయమని, అదేదో హైటెక్కు పూటకూళ్ళ లాడ్జి శృంగారకేళిలో కొందరు "పెద్దమనుషులు" సేదతీరారంటే పరమానందయ్య శిష్యులులాగా మనమూ అంటాం! ★

ఈ సంచికలో . . .

ఓరా! . . .	3
కార్టూన్ కదంబం... . . .	4
కవర్ స్టోరీ . . .	5
జీవనశైలి . . .	10
బాలల కథ . . .	11
బాలనేస్తాలు . . .	12
ఇంతి సంగతి . . .	16
నువ్వద్దీ . . .	17
ఆరోగ్యం . . .	18
పుస్తక పరిచయం . . .	21
న్యాయసలహాలు . . .	24

ఇంకా...

"బంగారు కొండ"

కథ ... 8, 9

పితృదేవోభవ

రియల్ స్టోరీ ... 14, 15



ఓరుగల్లుకోటలో శిల్పకళాతోరణం

టూరిస్ట్‌గైడ్ . . . 21

ప్రజానాట్యమండలి

కళాసాహితి . . . 22, 23

ఔరా!

వారెవ్వా ఏమి స్టయిలు?!

ప్రజాస్వామ్య రాజ్యనభాన్థలంబునందు కొలువుదీరిన కుబేరామాత్యులవారి స్టయిలే స్టయిలు! "ఏమని వ్యాఖ్యానింతు జనులారా..." అని ఓ సాంగు సింగాలనిపిస్తోంది. మన అమాత్యశిఖామణికి నులకమంచం హంసతూలికాతల్పం. పుటంపెట్టి కాల్చిన ఎర్రమట్టి ఘటంనీళ్ళు, ఫ్రిజ్‌నుంచి అప్పుడే తీసిన సుజలామృతం. డిటో మట్టి హుక్కా పీల్పు ధూమపానం, స్పెషల్ ఎఫెక్ట్ స్వర్గలోక విహారమే అనుకోండి. రైతు వేషధారి ఈ చిదంబరుడు నులక శయనుడు. దూరశ్రవణ యంత్రము(ఫోన్)లందు మాటకారి. లాప్‌టాప్ టకటకల మిషనుతోనూ నేర్పరే. కాలు కందకుండా సుతిమెత్తని మెరుపుల తివాచీపైన నులక మంచమెక్కిన ఈ వేషం బడ్జెట్ సీజన్‌లో వేయడమేమిటబ్బా అని సందేహాలు వస్తే రావచ్చు గాక! అల్లంత దూరాన నింగీ నేలా కలిసిపోయినట్టు కనబడటం లేదూ...అదన్నమాట మా చిదంబర రహస్యం!!



జైలుపక్షుల గానామృతం



సంగీతం గురించి "శిశుర్వేత్తి, పశుర్వేత్తి....." అని కదా మన పెద్దలు అంటుంటారు. గానానికి జైలైతేనేంటి, బయలైతేనేంటి అని అంటున్నారు మహారాష్ట్రంలోని నాసిక్ సెంట్రల్ జైలు ఖైదీలు. జైలులో పడ్డ ఖైదీలమైతేనేం...మాలోనూ కళాత్మకత ఉందని చాటుకుంటున్నారు. ఖోజ్ అనే స్వచ్ఛంద సంస్థవారి సహాయంతో ఎనిమిది మరాఠీ పాటలతో "ప్రయాస్" అనే సీడీని కంపోజ్ చేశారు. మార్చి 11న ఉప ముఖ్యమంత్రీజీ ఆర్ఆర్ పాటిల్ గారు ఆ సీడీని ఆవిష్కరించే ప్రయాస తీసుకున్నారు. ఖైదీలంటే బండరాళ్ళను బద్దలుకొట్టేవాళ్ళేకాదు...ఆ బండరాళ్ళను కరిగించేంత గానాన్ని కూడా ఆలపిస్తాం అంటున్నారు. జైలు యూనిఫారాల గళ్ళచొక్కాలు తొడుక్కుని కాలువలు తవ్వి నీళ్ళు పారిస్తారంతే కదా అనుకునేరు. పాటల పల్లవి కూడా కట్టగలరు అనిపించుకున్నారు. భళా ఖైదీ కన్నయ్యలూ... భళాభళి!!

ప్రథమ ఉత్తమ చెత్త...ద్వితీయ ఉత్తమ చెత్త!!



ఆస్కార్ సినీ అవార్డుల కన్నా విచిత్రమైన అవార్డు ప్రదానోత్సవం దానికి ముందు రోజు ఇస్తారు. ప్రతీ ఏడాదిలాగే ఈ ఏడాది కూడా ఉత్తమ చెత్త నటుడు, ఉత్తమ ద్వితీయ చెత్త నటుడు అవార్డులిచ్చారు. ఈ సంవత్సరపు ఉత్తమ చెత్త, ద్వితీయ చెత్తలకు ఓ అంతర్జాతీయ రాజకీయ సెటైర్ భళ్ళున పేలింది. మైఖేల్ మూర్ తీసిన 'ఫారన్‌హీట్ 9/11' సినిమాలో కనబడ్డ జార్జ్ బుష్ ప్రథమ చెత్త నటుడుగా ఎన్నికయ్యారు. వారి దూడా బసవన్న అలియాస్ రక్షణ మంత్రి డోనాల్డ్ రమ్స్ ఫెల్డ్ ద్వితీయ చెత్త నటుడు, చూయింగ్ గమ్ నములుతూ బుష్ యుద్ధవిధానాన్ని సమర్థించిన పాప్ గాయిని బ్రిట్నీ స్పియర్ ఉ.చె.నటిగా ఎన్నికయ్యారు. 'గోల్డెన్ రాస్ బెర్రీ' సంస్థ, సెప్టెంబర్ 11 నాటి డబ్ల్యూటీవో భవనాల కూల్చివేత తరువాత తీవ్రవాదం పెరిగిపోయిందని ప్రపంచం ముందు అత్యద్భుతంగా నటించినందుకు బుష్‌కి ఈ అవార్డు ఇచ్చింది. ఒక రాస్ప్బెర్రీ పండుకి బాగా నలిగిపోయిన ఫిలిం ముక్కను గుచ్చిన జ్ఞాపికను ఈ ప్రపంచ ఉత్తమచెత్త, ప్రపంచ ద్వితీయ ఉత్తమచెత్తలకు పంపుతారుట!!!

కార్టూన్ కదంబం



మీ మాట విని ఆపరేషన్ చేయించుకుంటున్నా
మాట తప్పితే నా కొంప కొల్లేరు అవుతుంది సార్
ఒక్క ఆడపిల్లతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుంటే రూ. లక్ష భీమా: వైఎస్

అసమ్మతి
మోడీ పదవికి ముప్పులేదు —అద్వానీ



గొంతు తడుపండి సార్...
ఇంకో నాలుగేళ్లు ఆగు నీ సమస్య తీరుస్తా...
వచ్చే ఎన్నికలకల్లా హామీలన్నీ పూర్తి చేస్తాం: వైఎస్



సినిమాకు మాటలొచ్చి డెబ్బైనాలుగేళ్లు

ఈరోజు నగటు మనిషి ఆలోచనలను అతని వ్యక్తిగత జీవితం తర్వాత సినిమాలు, రాజకీయాలే పోటీపడి ఆక్రమించుకొంటున్నాయంటే ఆశ్చర్యపోనక్కరలేదు. మనిషి జీవితంపైన, అతని అభిరుచులపైన అంతటి ప్రభావాన్ని చూపగలిగే స్థితికి సినిమా చేరుకుంది. సినిమా ప్రకటనలు, సినిమా వార్తలు లేని న్యూస్‌పేపర్లు, మ్యాగజైన్లు ఈ రోజు అసలు లేవు. ఇక సినిమాల ప్రకటనలు, సినిమాలకు సంబంధించిన కార్యక్రమాలు ప్రసారం చేయని టీవీ ఛానెల్‌ను కలలోనైనా ఊహించలేం. ఇంతటి ప్రాధాన్యత కలిగిన సినిమాకు మాటలొచ్చి ఈ మార్చికి 74 సంవత్సరాలయ్యాయి.

ఎం. కృష్ణగౌడ్

'సినిమాను తక్కువగా అంచనా వేయకండి. సినిమావాళ్ళు ఏదో ఒకనాడు మానవ జాతికి శాసనకర్తలవుతారు' అని ప్రఖ్యాతిగాంచిన ఐరిష్ నాటక రచయిత, విమర్శకుడు నోబెల్ బహుమతి గ్రహీత జార్జ్ బెర్నార్డ్ షా అన్న మాటలు నిజమేననిపిస్తోంది. అప్పుడెప్పుడో చెప్పిన ఈ మాట ఏదో ఆషామాషీగా ఊహించి చెప్పిన మాట కాదని పాక్షికంగానైనా నేడు రుజువైంది. ప్రజలకు సమాచారం, విద్య, వినోదాన్ని అందివ్వడంతోపాటు వారిని ప్రభావితంచేయడంలో ప్రజాబాహుళ్య (మాస్ కమ్యూనికేషన్ సాధనాలు పత్రికలు, టీవీ, రేడియో, సినిమా) సాధనాలది ప్రముఖపాత్ర. అందులో ముఖ్యంగా సినిమా ప్రజలను ఎక్కువగా ప్రభావితం చేసింది. ఎందుకంటే పత్రికలు చదువు వచ్చినవారికే ఉపయోగం. కానీ సినిమా దృశ్య మాధ్యమమయినందున అందరూ చూసి ఆనందించవచ్చు. అందుకే సినిమాకు నాటి నుంచి నేటి వరకు ఆదరణ పెరుగుతూనే ఉంది కానీ తరగడం లేదు. సగటు మనిషి జీవితంలో నేడు సినిమా అనేది ఒక విడదీయరాని భాగం. ఇద్దరు వ్యక్తులు చేరి పది నిమిషాలు పిచ్చాపాటీ మాట్లాడుకుంటే అందులో తప్పకుండా సినిమా ప్రస్తావన వస్తుంది. పిచ్చివాడయితే తప్ప సినిమాను చూసి ఆనందించని వ్యక్తి లేడంటే అతిశయోక్తి కాదు. మనిషికి వినోదాన్ని అందించే సాధనాలలో సినిమాదే ప్రధాన పాత్ర.

తెరపై బొమ్మలు కదలాడిన ఆ రోజులు...

1896 జూలై 7వ తేదీన బాంబేలోని వాట్సన్ హోటల్‌లో లూమియర్ సోదరులు ఆరు నిశ్శబ్ద (మూకీ) చిత్రాలను భారతదేశంలో మొదటిసారిగా ప్రదర్శించారు. కదిలే చిత్రాలను చూసి అప్పుడు ప్రజలు ఎంతో విస్మయానికి గురయ్యారు. బొమ్మలు కదలడం ఏమిటీఅని తమకళ్ళను తామే నమ్మలేక పోయారు. ఆ చిత్రాలను చూడడానికి ప్రజల తండోప తండాలుగా ఎగ బడ్డారు. అలాగే 1931 మార్చి 14వ తేదీన బొంబాయిలో ఆర్దెషిర్ ఇరానీ దర్శకత్వం వహించిన "ఆలంఆరా" చిత్రాన్ని చూసి ప్రజలు మరో మారు విస్మయానికి గురయ్యారు. ఎందుకంటే ఈ సారి బొమ్మలు మాట్లాడాయి! మాట్లాడడమే కాదు పాటలు కూడా పాడాయి.



మొదటి టాకీ చిత్రం 'ఆలం ఆరా'

అది చూసి నిజమా! కలా! అని సందేహం వ్యక్తంచేశారు. ఆ సినిమాను చూసి ఆనందించారు. ఆ వినోదం నేటికీ నిర్విఘ్నంగా కొనసాగుతోంది. దర్శకుడు ఇరానీ ఈ సినిమాలో మాటలతోపాటు 12 పాటలను ప్రవేశపెట్టాడు. ఈ చిత్రంతో చలన చిత్ర రంగంలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. ఈ కొత్తదనానికి ప్రజలు ఆకర్షితులయ్యారు. అక్కడి నుంచి సినిమా ప్రజలను ప్రభావానికి లోనుచేసింది. సినిమాలో ఏది చూపిస్తే దాన్ని ప్రజలు మెచ్చుకోసాగారు. ప్రజలకు తెలియకుండానే వారిని సినిమా శాసించడం మొదలు పెట్టింది. ఆలంఆరాతో మాటలు నేర్చిన భారతీయ సినిమా ఎన్నో కొత్త పుంతలు తొక్కుతూ సాంకేతిక

లుమియర్ సోదరులు

అభివృద్ధిని తనలో ఇముడ్చుకుంటూ అభివృద్ధి చెందింది.

సినిమాలో మాటలు, పాటలు ప్రవేశపెట్టిన తర్వాత నేపథ్య సంగీతంలో కూడా మార్పులొచ్చాయి. 35 ఎంఎం నుండి 75 ఎంఎం, సినిమాస్కోప్‌లకు, నలుపు తెలుపు చిత్రాల నుంచి కలర్ ఇలా ఒకదాని తరువాత మరొకటి అభివృద్ధి చెందుతూ వచ్చింది. సినిమాలో కొత్త సాంకేతిక అభివృద్ధి జరిగినపుడల్లా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. జీవితమే ఒక సినిమా అనే పరిస్థితి వచ్చింది. ప్రజలు సినిమా ప్రభావానికి లోనవడంతో అది సమాజంపై వివిధ ప్రభావాలను చూపింది.

మౌనం నుంచి మాటకు...

1913లో ధుండిరాజ్ గోవింద ఫాల్కే ఇంగ్లీషు వాళ్ళ సహకారం లేకుండా "రాజాహరిశ్చంద్ర"ను నిర్మించారు. అక్కడి నుంచి దేశంలో మూకీ చిత్రాల నిర్మాణం ఊపందుకుంది. ఆ తర్వాత 1917 నుంచి కలకత్తాలో, 1919 నుంచి మద్రాసులోను ప్రాంతీయ సినిమాల నిర్మాణం ప్రారంభమైంది. క్రమంగా దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ చలన చిత్ర నిర్మాణం విస్తరించింది.

1920 నుంచి దేశంలో సినిమాల నిర్మాణం ఒక రెగ్యులర్ పరిశ్రమగా ఊపందుకుంది. దక్షిణ భారతదేశంలో తొలి ఫీచర్ ఫిలిం "కీచకవధమ్"ను తమిళంలో నటరాజ మొదలియార్ 1919లో మద్రాసులో నిర్మించారు. తెలుగు భాషలో మొట్టమొదటి మూకీ సినిమా ''భీష్మప్రతిజ్ఞ''ను 1922లో ఆర్.ఎస్.ప్రకాశ్ నిర్మించారు. మన తెలుగు నేలపై తీసిన మొట్టమొదటి మూకీ చిత్రం "భక్తమార్కండేయ". దీన్ని 1926లో సి.పుల్లయ్య కాకినాడలో నిర్మించారు. భారతదేశపు తొలి టాకీ చిత్రం 'ఆలంఆరా' తర్వాత అదే సంవత్సరంలో తొలి తెలుగుటాకీ "భక్త ప్రహ్లాద"ను హెచ్.ఎం.రెడ్డి తీశారు. ఆ తర్వాత వివిధ ప్రాంతీయ భాషల్లో టాకీ చిత్రాల నిర్మాణం విరివిగా జరిగింది. 36 వరకు తెలుగు సినిమాలన్నీ పౌరాణిక కథలతోనే వచ్చాయి. 36లో తొలి తెలుగు సాంఘిక చిత్రం "ప్రేమ విజయం" విడుదలయింది. 38లో బిఎన్‌రెడ్డి "గృహలక్ష్మి"తో సాంఘిక చిత్రాల నిర్మాణ పరంపర ప్రారంభమైంది.

తెలుగు సినిమా టాకీ యుగం ప్రారంభం కాగానే 1931-41 వరకు రూపొందిన సినిమాలపై స్వాతంత్ర్య ఉద్యమం, కులనిర్మూలన, వితంతు



పునర్వివాహం, జమీందారీ వ్యవస్థ వంటి సాంఘిక సమస్యల ప్రభావం చాలా ఉంది. విప్లవ భావాలను ప్రవేశపెట్టి ప్రజలను చైతన్యవంతులను చేసిన గొప్ప దర్శకులు గూడవల్లి రామబ్రహ్మం. అప్పటి వరకూ ఎవరూ సాహసించని విధంగా, ఆ కాలంలో దేశాన్ని ఊపేస్తున్న హరిజనోద్యమాన్ని నేపథ్యంగా తీసుకుని 1939లో రైతుబిడ్డ, వరకట్న సమస్య నేపథ్యంలో "వరవిక్రయం," 1939లో పునర్వివాహం సమస్యతో "సుమంగళి" తీశారు. ఆనాటి సామాజంలో చలామణిలో ఉన్న మూఢాచారాలను ఎత్తిచూపుతూ చలం, తాపీ ధర్మారావు నిర్మించిన "మాలపిల్ల" అఖండ విజయం సాధించింది. వీరు చూపిన మార్గాన్ని విస్మరించి సాంఘిక చిత్రాలపైనే ఎక్కువ ఆసక్తిని చూపారు తర్వాతి దర్శకులు.

నలభయ్యవ దశకంలో రెండో ప్రపంచయుద్ధం, భారత స్వాతంత్ర్య పోరాటం కొనసాగుతున్న ఈ దశకంలో హిందీలో మరపురాని చిత్రాలు వచ్చాయి. శాంతారాం "డాక్టర్ కొట్నీస్ కీ అమర్ కహానీ," ఉదయశంకర్ "కల్పన", అబ్బాస్ "ధర్తీకే లాల్," సోరబ్ మోడీ "సికిందర్," "పుకార్," జె.బి.హెచ్.వాడియా "కోర్ట్ డాన్సర్," యస్.యస్.వాసన్ 'చంద్రలేఖ," "రాజ్‌కపూర్" "బర్సాత్," "ఆగ్"


ఆదూర్ గోపాలకృష్ణ సత్యజిత్ రే

మొదలగునవి వచ్చాయి.

1951-65 తెలుగు టాకీల స్వర్ణయుగం

పాతాళభైరవి, దేవదాసు, పెళ్ళిచేసిచూడు, రాజమకుటం, పెద్దమనుషులు, రంగులరాట్నం, రోజులు మారాయి, నమ్మినబంటు, మాయాబజార్, తెనాలి రామకృష్ణ, మూగ మనసులు, శ్రీకృష్ణ పాండవీయం, సీతారామ కళ్యాణం, లవకుశ, అనార్కలి, సాక్షి, గూఢచారి 116లతో తెలుగు సినిమా విలసిల్లింది. తెలుగు సినిమాలో తొలి రెండు దశాబ్దాల్లో దర్శకులు, నిర్మాతలు హీరోలు కాగా, తర్వాత హీరోలదే పైచేయి అయ్యింది. అక్కడి నుంచి సినిమా దారి తప్పింది. హీరోల కోసమే సినిమాలు నిర్మిస్తూ సామాజిక బాధ్యతను విస్మరించారు.

1965 నుంచి వ్యాపార ధోరణి:

1965 నుండి హీరోల కోసం సినిమాలు నిర్మించడం మొదలయి చలనచిత్ర పరిశ్రమలో వ్యాపార ధోరణికి ద్వారాలు తెరుచుకున్నాయి. ఎక్కువ భాగం మధ్యతరగతి కుటుంబ కథలనే ప్రతిభావంతంగా తెరకెక్కించిన హిందీ, తెలుగు సినిమా ధోరణి, 75 నుంచి పూర్తిగా మారిపోయింది. భారీవ్యయంతో, అట్టహాసపు సెట్లతో, ఇంకెన్నో రకాల హంగులతో చిత్రాల నిర్మాణం సర్వసాధారణమైపోయింది. దాంతో సినిమాలలో విలువలు, నాణ్యతలు పడిపోయాయి. ప్రజల సమస్యలను తట్టిచూపే చిత్రాలు ఈ మధ్య కాలంలో కరువయ్యాయనే చెప్పాలి.

1990 తర్వాత సినిమాలో కొత్త ధోరణికి శ్రీకారం చుట్టింది. చాంతాడు డైలాగుల యుగం ముగిసింది. కథ, టెక్నిక్, చిత్రీకరణలో కొత్తదనం, సంగీతానికి, రీరికార్డింగ్‌కు అధిక ప్రాధాన్యం, సహజమైన డైలాగులు వంటి వాటితో అనేక ఆధునిక ధోరణులను ఇండియా సినిమా స్వీకరించక తప్పలేదు. అయితే హింస, అశ్లీలం మరింత ఎక్కువయింది. హిందీ,



మూకీ టాకీగా... టాకీ ఎఫెక్టీవ్‌గా...



ఆలంఆరాకు ముందు మౌన చిత్రాలను ప్రదర్శించేప్పుడు పలు సంగీత పరికరాలతో కళాకారులు సన్నివేశానికి అనుగుణంగా వాయించేవారు. తెర పక్కగా ఓ వ్యక్తి రేకుతో తయారుచేసిన బకాలో కథను, అక్కడక్కడ డైలాగులు చెప్పేవారు. అలంఆరా సినిమాలో మాటలను, పాటలను ప్రత్యేకంగా రికార్డింగ్ చేసి చిత్రంతోపాటు వినిపించారు. ధ్వని తరంగాలను అయస్కాంత తరంగాలుగా మార్చే సాంకేతిక అభివృద్ధి జరిగిన తర్వాత మాగ్నటిక్ టేప్‌పై రికార్డింగ్ చేసి విడివిడిగా చిత్రాన్ని, మాటలను వినిపించారు. ధ్వని తరంగాలను కాంతి రూపంలోకి మార్చు చెందే సౌకర్యం రాగానే మాటలను కాంతి తరంగాలుగా మార్చి ఫిల్మ్‌పైన రికార్డ్ చేశారు. చిత్రాన్ని, ధ్వనిని ఒకే ఫిల్మ్ ద్వారా ప్రదర్శించారు. 1980 తర్వాత సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధితో రికార్డింగ్‌లో ట్రాకింగ్ పద్ధతి వచ్చింది. అంతకుముందు అన్ని సంగీత పరికరాల శబ్దాలు, మాటలను మోనో పద్ధతిలో ఒకే దగ్గర రికార్డింగ్ చేసేవారు. దాంతో మోతగా వినపడేది. ట్రాక్ పద్ధతిలో మాటలను, వివిధ సంగీత పరికరాల ధ్వనులను విడివిడిగా రికార్డింగ్ చేసేవారు. దాంతో మాటలు, నేపథ్య సంగీతం స్పష్టంగా వినడానికి వీలుకలిగింది. ఒక ట్రాక్ నుండి ఆరు ట్రాక్‌ల వరకు రికార్డింగ్ చేసేవారు. ఈ తర్వాత జెబిఎల్, స్టీరియోఫోనిక్, డాల్బీ పద్ధతుల్లో రికార్డింగ్‌లో మరింత కొత్తదనం వచ్చింది. దాంతో మాటలు, పాటలు, నేపథ్య సంగీతం మరింత స్పష్టంగా, శ్రావ్యంగా ప్రేక్షకులకు వీనులవిందు చేయడంతోపాటు కొత్త అనుభూతిని కల్గించింది. 1990 తర్వాత వచ్చిన డిజిటల్ టెక్నాలజీతో సినిమా మాటలు, నేపథ్య సంగీతం రూపురేఖలే మారిపోయాయి. గుండుపిన్ను నేలపై పడితే ఆ శబ్దాన్ని కూడా స్పష్టంగా వినే సౌకర్యం ఈ డిజిటల్ పద్ధతి వల్ల కలుగుతోంది. నేడు మాటలనే కాకుండా సినిమాను కూడా డిజిటల్ మోడ్‌లో రూపొందిస్తున్నారు.

DIGITAL dts SOUND



తెలుగులో మరింత ఆధునికత సంతరించుకుంది. సంగీతం, వినోదం ప్రధానమయ్యాయి. అనవసరమైన హింస చిత్రాల్లోంచి మాయమైంది. ఉమ్మడి కుటుంబాలు, పెళ్ళి సంబరాలు, సరదాలు, యంగ్ పేరెంట్స్ నేటి సినిమాల్లో తప్పనిసరిగా ఉంటున్న అంశాలు. సినిమా నిర్మాణం కోసం భారీ వ్యయం చేయడం కూడా సర్వసాధారణమైపోయింది. ముఖ్యంగా రొటీన్‌గా ఏదో ఓ సినిమా తీస్తే ప్రేక్షకులు చూసే రోజులు పోయాయి.

వాస్తవ చిత్రాలు (ఆర్ట్ ఫిల్మ్స్)

1955లో సత్యజిత్‌రే తీసిన పథేర్ పాంచాలి ఆగమనంతో భారతదేశ చలన చిత్ర పరిశ్రమలో నియోరియలిజం, న్యూవేవ్‌ల చిత్రాల (ఆర్ట్ ఫిలింలు) పరంపర ప్రారంభమైంది. హిందీలో భీమల్‌రాయ్ నిర్మించిన దో భీగా జమీన్, దేవదాస్, మధుమతి, రాజ్‌కపూర్ నిర్మించిన బూట్‌పాలిష్, జాగ్‌తే రహో, శాంతారాం నిర్మించిన దో ఆంఖే బారాహాత్, ఝనక్‌ఝనక్ పాయల్ బాజే, మెహబూబ్ నిర్మించిన మదరిండియా వంటి ఎన్నో హిందీ చిత్రాలు వచ్చాయి. రే తర్వాత రిత్విక్ ఘటక్, మృణాళ్‌సేన్‌లు ఆర్ట్ ఫిలిం దర్శకులుగా బాగా పేరు తెచ్చుకున్నారు. ఈ ముగ్గురికీ కలిపి ఫౌండింగ్ ఫాదర్స్ ఆఫ్ న్యూ సినిమా ఇన్ ఇండియా అన్న పేరు స్థిరపడింది. దక్షిణ భారతంలో ఆర్ట్ ఫిలింలు ముందు కన్నడంలో గిరీష్ కాసరవెల్లి, మళయాళంలో ఆదూర్ గోపాలకృష్ణ, అరవిందన్‌లు ప్రారంభించారు. 1980లో కూడా బాగానే ఆర్ట్ ఫిలింలు వచ్చాయి. మంథన్, భూమిక, నిశాంత్, జునూన్, త్రికాల్ వంటి సినిమాలు శ్యామ్ బెనెగళ్ దర్శకత్వంలో రాగా, గోవింద్ నిహలానీ దర్శకత్వంలో అఘాత్, తమస్ చిత్రాలు వచ్చాయి.



తెలుగులో 1930లలోనే మాలపిల్ల, రైతుబిడ్డ వంటి ప్రయోగాత్మక సినిమాలు కొన్ని వచ్చాయి. 1977లో ప్రముఖ బెంగాలీ దర్శకుడు మృణాల్‌సేన్ దర్శకత్వంలో తీసిన ఒక ఊరికథ సినిమా ద్వారా తెలుగుతో వాస్తవిక సినిమా ప్రారంభమైంది. అనుగ్రహం, మా భూమి, నిమజ్జనం, రంగులకల, దాసి, మట్టిమనుషులు వంటివి కొన్ని వచ్చాయి. వీటిలో చివరి రెండు సినిమాలు మామూలు ప్రదర్శనకు కూడా నోచుకోకపోవడం దురదృష్టకరం.

ఒకప్పుడు సామాజిక బాధ్యతతో అన్నివర్గాల ప్రేక్షకుల కోసం రూపొందిన సినిమా నేడు దారి తప్పింది. ప్రజలను చైతన్యవంతుల్ని, విద్యావంతుల్ని చేయాల్సిన సినిమా నేడు పాశ్చాత్య సినిమా ప్రభావానికి లోనయింది. ప్రజా సంస్కృతి, సంప్రదాయాలను తుంగలో తొక్కి పడమటి దేశాల సంస్కృతిని చూపుతూ యువకులను పెడతోవ పట్టిస్తున్నాయి. 'సినిమా ఒక పరిశ్రమ, ఒక వ్యాపారం, ఒక కళ, ఒక జూదం, ఇవన్నీ కలిసిందే సినిమా' అని మహాకవి శ్రీశ్రీ అన్నమాటలు అక్షర సత్యాలు. అయితే నిర్మాతలు, దర్శకులు కళను, సామాజిక బాధ్యతను విస్మరించి వ్యాపార ధోరణిలోనే సినిమా నిర్మాణం చేస్తున్నారు. ప్రస్తుతం 'మాస్ మసాలా'ల మయమవుతున్నాయి. 'నవలలు చదివి నవలలు రాసినట్లే, సినిమాలు చూసి సినిమాలకు రాసేవారే ఎక్కువ. జీవితాన్ని, మనుషుల్ని, తత్వాల్ని తరచిచూసి రాసేవాళ్ళు బహు తక్కువ' అని రచయిత ఎమ్వీఆర్ అన్నట్లు దర్శకులు పాశ్చాత్య చిత్రాలను అనుకరించడానికే సమయాన్ని వెచ్చిస్తున్నారు గానీ సమాజంలో ఉన్న సమస్యల జోలికి వెళ్ళడంలేదు. మన అభివృద్ధి చేసుకుంటున్న టెక్నాలజీ సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడాలి గానీ వినాశనానికి కాదు. అలాగే మాటలు నేర్చిన సినిమా ద్వారా సమాజ వాస్తవాలను ప్రజలకు తెలిపి వారిని చైతన్యం చేయవల్సిన బాధ్యత ప్రతి నిర్మాత, దర్శకునిపై ఉంది.

☆



"బంగారు కొండ"

డా॥ కె.ఎల్.వి. ప్రసాద్

ఉదయం పావు తక్కువ తొమ్మిదవుతోంది. ఖాజీపేట రైల్వేస్టేషన్లో మూడు ప్లాట్ ఫారాల మీద జనం విపరీతంగా ఉన్నారు. ఎవరి హడావిడిలో వాళ్ళున్నారు. స్టేషన్ చివర ఒక బెంచీ మీద కూర్చున్న వినోద్ మాత్రం అసహనంగా ఉన్నాడు. ఆలస్యం భరించలేక, కూర్చున్న చోటు నుండి లేచి, ప్లాట్‌ఫారం నంబర్‌వన్ మీద అటూ-ఇటూ పచార్లు చేస్తున్నాడు. ఎవరైనా అతనిని గమనిస్తే అతను మార్నింగ్‌వాక్ కోసం రైల్వేస్టేషన్‌కు వచ్చాడేమో అన్పించేట్లుగా వుంది అతని నడక.

అతని అసహనం, ఎదురు చూపులు విజయవాడ నుంచి వచ్చే శాతవాహన ఎక్స్‌ప్రెస్ కోసం... అందులో ప్రయాణమయి వస్తున్న తన మూడునెలల ప్రథమ సంతానం పుత్ర రత్నం రాకేష్, భార్య నలందల కోసం. అది సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్సేగాని, ఎప్పుడూ ఆలస్యంగానే వస్తుంటుంది. వినోద్ హడావిడికి తగ్గట్టుగానే, ఒక అరగంట ఆలస్యంగా శాతవాహన ఎక్స్‌ప్రెస్ ఎట్టకేలకు కాజీపేట స్టేషన్‌కు చేరుకుంది.

వినోద్ సరాసరి ఎ.సి. చైర్‌కార్ వైపు పరిగెత్తాడు. వేసవికాలం కావడంతో తనకొడుకు, భార్య ఎక్కడ అలసిపోతారోనన్న ఉద్దేశంతో, ముందుగానే మామగారికి సెల్‌ఫోన్‌లో 'ఎస్.ఎం.ఎస్' పంపించాడు వినోద్. వాళ్ళకి యిష్టం లేకపోయినప్పటికీ, అల్లుడు ఎక్కడ అలుగుతాడోనని భయపడి, తమ తాహతుకు అది ఎక్కువయినా, మారుమాట్లాడకుండా ఎ.సి. చైర్‌కార్‌కు టికెట్లు బుక్ చేశారు పరమేశ్వరంగారు.

కంపార్ట్‌మెంట్ దిగిన భార్య, సుపుత్రుణ్ణి చూడగానే వినోద్ ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఫ్లాట్‌ఫారంమీద జనం వున్నారన్న సంగతికూడా పట్టించుకోకుండా నలందను అప్యాయంగా కౌగిలించుకుని ఆమె నుదిటిమీద, మృదువైన ముద్దు పెట్టాడు. కొడుకు రాకేష్‌ను అందుకుని తనివితీరా వళ్ళంతా నిమిరి, ముద్దుల వర్షం కురిపిస్తున్నాడు. ఇది గమనించిన అత్తగారు.

"బాబూ యీ రోజు మనం ఇంటికి వెళ్ళేది వుందా? లేక ఇక్కడే బసచేద్దామా?" అంది కాస్త నవ్వు ముఖంపెట్టి.



అత్తగారి మాటలకు తేరుకుని గబగబ లగేజీ లైసెన్స్ కూలికి అందించి, తనకారు దగ్గరికి దారితీశాడు వినోద్.

సుమారు ఆరునెలలపాటు భర్త ఎడబాటులో వున్న నలంద అతని అనురాగం, ఆప్యాయతలకోసం భర్త కంటే ఎక్కువగా ఎదురుచూస్తోంది.

అందుకే కారులో ప్రయాణిస్తున్నంతసేపూ ఒకటే ముచ్చట్లు కిలకిలలు. వాళ్ళ ఆనందాన్ని అదుపు చేయడానికా అన్నట్లు వినోద్ ఫ్యాంట్ మొత్తం తడిపేశాడు రాకేష్. చేసింది చాలక పెద్దగొంతుతో ఏడుపు లంకించుకున్నాడు.

ఈలోగా ఎక్సయిజ్‌కాలనీ రానే వచ్చింది. సామానంతా ఇంట్లో పెట్టించాడు వినోద్. బట్టలు మార్చుకుని ఇల్లంతా సర్దడం మొదలుపెట్టాడు. బెడ్‌రూమ్ నీట్‌గా సర్ది డెట్టాల్‌తో గది అంతా శుభ్రం చేయించాడు. క్రొత్తగా పెట్టించిన ఎయిర్‌కండిషనర్ ఆన్ చేశాడు. కొడుకును ఎత్తుకు తిరగడంలోను, మధ్య మధ్యలో నలందపై ఛలోక్తులు విసరడంలోను అతను ఎంజాయ్ చేస్తున్నాడు. అతను ఒంటరిగా వున్నప్పుడు, సెలవురోజుల్లో అసలు సమయం గడిచేదే కాదు. ఇప్పుడు అతనికి అసలు సమయమే తెలీడంలేదు.

* * *

నలందను ఏరికోరి చేసుకున్నాడు వినోద్. అంటే నూటికి నూరుశాతం ప్రేమ వివాహం అన్నమాట! నిజానికి, వినోద్‌కి నలందనిచ్చి పెళ్ళి చేయడం, ఆమె తండ్రి పరమేశ్వరం గారికి అసలు ఇష్టంలేదు. ఇరువైపులది ఒకే కులం అయినప్పటికీ, మతం విషయం వచ్చేసరికి తేడా వచ్చేసింది.

నలంద వాళ్ళది మొదటినుంచీ, పూజలూ-వ్రతాలు చేసే హైందవ సాంప్రదాయ కుటుంబం, వినోద్ వాళ్ళదయితే, కొన్ని తరాలనుంచి క్రైస్తవంలో నిండా మునిగిపోయివున్న కుటుంబం. అందుచేత పెళ్ళి విషయం వచ్చేసరికి, వినోద్ బ్యాంక్ ఆఫీసర్ అయినప్పటికీ అతని వెనుక ఆస్తిపాస్తులు ఉన్నప్పటికీ, పరమేశ్వరంగారు పరమ ఛాందసుడుగా అడ్డుపుల్ల వేశారు. వినోద్‌కి, నలందకు టెన్షన్.

నలంద తల్లి సుభద్ర తెలివయినది. ముందుచూపు గలది. భవిష్యత్తును తేలిగ్గా అంచనా వేయగల సమర్థురాలు కావడంతో, భర్తను ఒప్పించి నలంద కోరిక మేరకు, ఓ శుభముహూర్తాన తన కూతురిని వినోద్‌కిచ్చి వైభవంగా కళ్యాణం జరిపించేసింది.

ఆ తర్వాత అల్లుడి సత్ప్రవర్తన, మంచితనం, సహృదయంవల్ల, ఈ పెళ్ళి విషయంలో తను ఏమాత్రం తప్పటడుగు వేయలేదన్న భావాన్ని పరమేశ్వరంలో కలిగించాయి. అందుకే సమయం, సందర్భం వచ్చినప్పుడు తన అల్లుడి గుణగణాల గురించి ఎంతో గొప్పగా తన బంధుమిత్రుల దగ్గర చెప్పుకుంటాడాయన. అల్లుడు ప్రముఖ రచయిత కూడా కావడంతో, తన స్నేహితుల మధ్య పరమేశ్వరంగారు ఎంతో గర్వంగా ఫీలవుతుంటారు.

* * *

నలంద ఒక రకంగాను. వినోద్ మరో రకంగాను కోరుకున్న సమయం రానే వచ్చింది. స్నానం చేసి, తల్లిచేత తన ఇష్టంగా కొనిపించుకున్న చీర కట్టుకుని తలనిండా మల్లెపూలు తురుముకుని, కొత్తపెళ్ళికూతురిలా తయారయింది నలంద. అదే ఒకప్పుడయితే, అలాంటి సన్నివేశంలో తనని ఆప్యాయంగా దగ్గరికి తీసుకుని వుండేవాడు. ఇప్పుడు అతని ధోరణి భిన్నంగా ఉంది.

రాత్రి భోజనాలు ముగిశాక, తన బెడ్‌రూమ్‌కి చేరుకుంది నలంద.

కొడుకు రాకేష్ హాయిగా తాతగారు కొనిచ్చిన ఊయలలో ఊగుతూ నిద్రపోతున్నాడు. డబుల్‌కాట్‌ను వేరు చేసే ప్రయత్నంలో ఉన్నాడు వినోద్. అది గమనించిన నలంద "అదేమిటండీ వీటిని వేరు చేస్తున్నారు?" అంది కాస్త ఆశ్చర్యంగా.

"కొంతకాలం వేరుగా ఉంటే మంచిదని!" అన్నాడు వినోద్ కొంటెగా.

"అదే ఎందుకు"? అంది భర్త వంక చురచుర చూస్తూ "నేను యిన్నాళ్ళనుండి, రోజులను క్షణాలుగా లెక్కించుకుంటూ ఎదురుచూస్తున్నది దీనికోసమేననుకుంటున్నారా"? అంది నలంద కాస్త బేలగా.

"చూడు నల్లూ...!! మన బాబు కాస్త పెద్దయ్యాక, నీకు పూర్తిగా ఆరోగ్యం చిక్కాక... నువ్వన్నట్టుగానే... ఓ.కే!" అన్నాడు భార్యను ఓరకంట చూస్తూ.

"ఏమోనండి నాకేదో భయంగావుంది. నేను పొద్దున ఇక్కడికి వచ్చినప్పటి నుంచి గమనిస్తున్నాను కదా! మీలో ఏదో పెద్ద మార్పే కన్పిస్తోంది నాకు. అంటీ అంటనట్లుగా తిరుగుతున్నారు. అసలు మీకేమయిందోచెప్పండి" అంది కాస్త ఏడుపుముఖంపెట్టి.

"అబ్బబ్బ! నల్లూ...! నీకు దగ్గరగా వుండాలని నాకు మాత్రం లేదనుకుంటున్నావా? ఇలాంటి చిన్న చిన్న విషయాలకే అలా బేలవయితే ఎలా చెప్పు! ఆఁ ... కాస్త ఓపిక పట్టాలమ్మా" అన్నాడు.

"లేదు... లేదు... మీరు చాలా మారిపోయారు. మీరు అప్పటి నా వినోద్‌లా ప్రవర్తించడంలేదు. క్షణం కూడ నన్నువదలకుండా, నా చెంగుపట్టుకు తిరిగే మీరు, ఇట్లా వింతగా ప్రవర్తిస్తుంటే నాకెందుకో కుడికన్ను అదురుతోంది" అంది ఉబికివస్తున్న ఏడుపును ఆపుకోవడానికి ప్రయత్నంచేస్తూ.

ఆమె పరిస్థితికి వినోద్ కూడా తట్టుకోలేని పరిస్థితికి వచ్చాడు. ఆమెను మరింత సస్పెన్స్‌లో ముంచడం ఇష్టంలేక "నల్లూ...!! అర్థంచేసుకోగలిగితే, నీకు ఒక నిజం చెబుతాను. అనవసరమయిన నిష్ఠూరాలతో, నాపై యుద్ధం ప్రకటించనని మాటయిస్తే..." అన్నాడు వినోద్.

"సంతోషంగా వుండవలసిన దానిని ఎందుకు ఇలా మానసికంగా హింసిస్తున్నారు? నాలో టెన్షన్ మరింత పెంచకండి. అదేంటో త్వరగా చెప్పండి" అంది, ఆందోళనగా భర్త భుజాలు పట్టి ఊపుతూ.

"ఇందులో టెన్షన్‌పడే విషయం ఏమీలేదు గాని, నువ్వు యివాళ వస్తున్నావని తెలిసి, నిన్ననే వేసెక్టమీ ఆపరేషన్ చేయించుకున్నాను. నీకు ఆపరేషన్ చేయించడం అంటే... అది నేను తట్టుకోలేని విషయం. అందుకే నేను చేయించుకున్నాను" అన్నాడు.

"అయ్యో, ఎంతపని చేశారండీ! నాకు చెప్పకుండా ఇంతపని చేస్తారా? మీ హృదయంలో నాకున్న విలువయింతేనా! మనకున్నది ఒకే ఒక బాబుకదా! వాడికి కూడా మూడు నెలలే..." అంటూ ఒక సాధారణ స్త్రీలా ఏడ్వడం మొదలుపెట్టింది నలంద.

"ఛ...ఛ నల్లూ...! యింతేనా నువ్వు నన్ను అర్థం చేసుకున్నది. నా హృదయంలో నీకు కాకుంటే ఎవరికుంటుంది విలువ? నా హృదయం నిండా అల్లుకున్నది నువ్వే సుమా! ముందు నువ్వు ఇది గ్రహించాలి. దీని గురించి నువ్వు అనవసరంగా బాధపడకూడదు నల్లూ. గంపెడు పిల్లల్నికని వాళ్ళని ఎటూ కాకుండా చేసే బదులు, ఒక్కడిని మన కోరిక మేరకు ప్రయోజకుణ్ణి చేయడం మేలుకదా! మన బాబుని జాగ్రత్తగా పెంచుకుని, పెద్ద పెద్ద చదువులు చదివిద్దాం. ఉన్నత స్థానానికి చేరుకునేలా మనం కష్టపడదాం" అన్నాడు సౌమ్యంగా భార్య తల నిమురుతూ వినోద్.

"మీరు నాకు అంత విలువ యిచ్చిన వాళ్ళయితే, యీ విషయంలో మీరు స్వయం నిర్ణయం తీసుకోరు. నన్నిలా అన్యాయం చెయ్యరు. ఎంత తేలిగ్గా తీసుకున్నారు యీ విషయాన్ని!!" అంటూ ఏడుపును మరింత ఉధృతం చేసింది నలంద.

"చూడు నలందా! యీ విషయం విన్నవెంటనే నువ్వు బాధపడ్తావని తెలుసు. నువ్వు దానిని సరిగ్గా అర్థం చేసుకోకపోవడం వల్ల నీకు అంతబాధ కలుగుతున్నది. కాని నేను యిలా ఎందుకు చేశాను ప్రశాంతంగా నువ్వు ఆలోచించినట్లయితే, అప్పుడు నేను చేసింది కరెక్టు అని నువ్వే అంటావు" అన్నాడు.

"ఏమో! నా బాధ నాది, అది మీకు అర్థం కాదు కదా! అయినా... యీ విషయం అమ్మకు తెలిస్తే...!!" అంది అతని వంక ప్రశ్నార్థకంగా చూస్తూ.

"తెలిస్తే ఏం చేస్తుందట! కాసేపు నీలానే గోల చేస్తుంది. అయినా నల్లూ... నాకు తెలీక అడుగుతాను... మన పిల్లల్ని పెంచేది మనమా? లేక మీ అమ్మా?" అన్నాడు కాస్త సీరియస్‌గానే వినోద్. నలంద కాస్త మెత్తబడక తప్పలేదు.

"అదికాదండి! ఏదో వాళ్ళు పెద్దవాళ్ళుకదా! మీలా వాళ్ళు దూరదృష్టితో ఆలోచించలేరుకదా! ఈ వయస్సులో వాళ్ళకి కాస్తయినా మనం విలువ యివ్వాలి కదా!" అంది బ్రతిమాలుతున్న ధోరణి.

"ఆఁ ఇప్పుడు దారిలోకొచ్చావ్. అయినా, నల్లూ...!! నువ్వు చెప్పిన దాంట్లో నాకు ఎలాంటి భేదాభిప్రాయమూ లేదు. కాని పిల్లలకి సంబంధించి మన నిర్ణయమే ఫైనల్ అయితే బావుంటుంది. కాని ముందుగా చెప్పకపోవడం నా పొరపాటే! అయితే, ముందుగానే నేను నీకు చెప్పి, అది నువ్వు అర్థం చేసుకునే లోపు మనం తొందరపడితే... అనుకున్నదంతా గల్లంతే కదా!" అన్నాడు వినోద్.

"అయితే, యీ నిర్ణయం మీరు ముందే తీసుకున్నారన్నమాట! మీకు వ్యతిరేకంగా చేసి నేను మాత్రం బావుకునేదేముందండి! బాబును జాగ్రత్తగా పెంచుకుంటేచాలు. చక్కగా తీర్చిదిద్దితే వాడిలోనే అన్నీ చూసుకోవచ్చు. టెక్నికల్‌గా ఏదైనా సమస్యలొస్తాయేమోనన్నదే నా భయం" అంది అతని కళ్ళల్లో కళ్ళు పెట్టి చూస్తూ నలంద.

"అలా కాదుగాని... మా అన్నయ్య సంగతి నీకు తెలుసుకదా! తను డాక్టరయివుండి తను పాటించకుండా ఇతరులకు చెప్పడం ఆయనకు అసలు ఇష్టం వుండదు. అందుకే వదిన సహకారంతో అయన అసలు పిల్లలే పుట్టకుండా ఆపరేషన్ చేయించుకోలేదూ! ఆయన నిర్ణయం ముందు మనమెంత చెప్పు" అన్నాడు వినోద్. "నిజమేననుకోండి... కాని..."

"కాని...లేదు అర్థణా...లేదు. మన ఆశకు అంతెక్కడుంటుంది చెప్పు. మన పెళ్ళికి ముందే అన్నయ్య ఏమి చెప్పారో తెలుసా?"

"ఏమి చెప్పారు?" అంది ఆతృతగా నలంద.

"తమ్ముడూ, నువ్వు ధనవంతుడివే కావచ్చు. ఎంతమందినయినా కని... పెంచే శక్తి నీకుండవచ్చు. కాని ఈ సమాజం మాత్రం వాళ్ళందరినీ పెంచలేదుగా! అందుకే ముందుగానే నిన్ను హెచ్చరిస్తున్నానురా" అన్నాడు అన్నయ్య.

"అదాండి అసలు సంగతి...! అన్నయ్యకు తగ్గతమ్ముడు... మరి నాకు ముందే యీ విషయం చెబితే నాకు ఈ పాడు టెన్షన్ వుండేదికాదు కదా!" అంది అతని చేయిపట్టుకుంటూ

"దేనికయినా సమయం, సందర్భం వుండాలమ్మాయ్! లేకుంటే ఆ పాయింట్‌కు విలువేది? ఏది యేమయినా నువ్వు నన్ను అర్థం చేసుకున్నందుకు థాంక్స్" అన్నాడు వినోద్ నవ్వుతూ.

"సర్లెండి పెద్ద గొప్ప .... " అంటూ భర్త నుదుట సున్నితంగా ముద్దుపెట్టుకుంది నలంద.

"నా బంగారుకొండ!" రాకేష్‌ను తెగముద్దాడుతోంది నలంద.

వినోద్ తన మంచం సర్దుకుంటూ నలంద వైపు సంతోషంగా చూశాడు.

★

ముదిగంటి సుజాతారెడ్డి

ఇంగ్లీషు రాకపోతె ఏమిటట!

ఊరి నుంచి మా పెద్దమ్మ కూతురు అనసూర్య వచ్చింది. దాని కొడుకు పట్నంలో కంప్యూటరు ఇంజనీరింగులో చేరాడు. క్లాసులో లెక్చరరు ఇంగ్లీషు రాదని హేళనగా మాట్లాడినందుకు ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడని తెలుసుకొని అనసూర్య బెంగతో పట్నం వచ్చింది. దాని కొడుకు ప్రసాద్ బి.ఎస్సీ వరకు తెలుగు మీడియంలో వాళ్ళ జిల్లా కాలేజీలోనే చదివాడు. వీడికి ఇంగ్లీషు అంటే విదేశీభాషగానే అనిపిస్తుంది. అటువంటి కొడుకు ఏం అఘాయిత్యం చేసుకుంటాడో అనే భయంతో అనసూర్య కొడుకును స్పోకెన్ ఇంగ్లీషు క్లాసుల్లో చేర్పించాలని వచ్చింది. దాని భర్త పొలం పనులని ఊర్లోనే వుండిపోయాడు.

"అబ్బ! ఇప్పుడు నాకు నిమ్మళంగా వుందే! ప్రసాద్ స్పోకెన్ ఇంగ్లీషులో చేరాడు! ఆరు నెలల్లో ఇంగ్లీషు మాట్లాడటం వస్తుంది. భయం లేదన్నారు వాళ్ళు. ప్రసాద్ సంతోషంగా చేరాడు ఆ కోర్సులో" అనసూర్య కొడుకును ఇనిస్టిట్యూట్‌లో సాయంత్రం నేర్పే క్లాసుల్లో చేర్పించి వచ్చింది.

"ఇంగ్లీషు సరిగ్గా రానంత మాత్రాన ఆ లెక్చరరు ఆ విధంగా విద్యార్థిని హేళన చేయటం చాలా తప్పు!" అన్నాన్నేను.

"విద్యార్థివచ్చిన నేపథ్యం ఏమిటో లెక్చరరు కూడా కాస్త గమనించితే గదా. ఇంగ్లీషు మీడియం నుంచి వచ్చిన విద్యార్థులను, ఊర్లల్లో తెలుగుమీడియంలో చదివి వచ్చిన విద్యార్థులను ఒకే గాటన కట్టి అట్లా మాట్లాడితే ఎట్లా ఆ ఇంగ్లీషు లెక్చరరు?" అంది అనసూర్య.

అనసూర్య తెలుగు మీడియంలో ఇంటర్ వరకు చదివింది. ఎన్.టి.ఆర్ పదవిలోకి వచ్చి తెలుగు చదివిన విద్యార్థులకు ఉద్యోగావకాశాల్లో ప్రిఫరెన్స్ ఇస్తామని ప్రకటించిన కాలమది. తెలుగు మీద అభిమానంతో తెలుగువాళ్ళ గౌరవం పెంచాలనే ఉత్సాహంతో టెన్త్ అయింతర్వాత అనసూర్యను వాళ్ళ నాన్న ఇంగ్లీషు మీడియంలో కాక తెలుగు మీడియంలో చేర్పించి చదివించాడు. ఇంటర్‌తో దాని విద్యకు గుంట తవ్వి గంట కొట్టటం, ఒక వ్యవసాయదారునితో దాని పెండ్లి జరగటం అన్నీ దబదబ అయిపోయాయి. మరుసటి సంవత్సరానికే ప్రసాద్ పుట్టాడు. వాడూ వున్న పరిస్థితుల్లో తెలుగు మీడియమే చదివాడు. ఎన్ టి. ఆర్.తో తెలుగుమీడియం వీరాభిమానం మాయమైంది. అందరూ ఇంగ్లీషు మీడియాలకు ఎగబడుతున్నారు. అయినా పాపం ప్రసాద్ డిగ్రీవరకు తెలుగు మీడియంలోనే, సొంత ఊరికి దగ్గర్లోనే చదవవలసి వచ్చింది. అదంతా తలచుకొని నిట్టూర్పు విడిచింది అనసూర్య. "మావాడిని ఇంగ్లీషు మీడియంలో చదివించాల్సింది. తప్పు చేశాం" అంది విచారంగా. దాని కళ్ళల్లో నీలినీడలు వ్యాపించాయి. ఇంగ్లీషు మాట్లాడితే గొప్ప అన్న భావన ఇంగ్లీషు వాళ్ళ వలసపాలన కాలం నుంచి ఇప్పటిదాకా వదలనే లేదు! అప్పటికీ ఇప్పటికీ ఇంగ్లీషు ప్రాధాన్యం తగ్గలేదు. గిరీశం సంగతి తెలుసుగద మనకు!

"అయినా ఈ కాలంలో ఇంగ్లీషు మీడియంలో చదివినా... ఇంగ్లీషు సరిగ్గా చదవటం, వ్రాయటం, మాట్లాడటంరాని విద్యార్థులెందరో వున్నార్లే అనూ! నువ్వేం బాధపడకు. అయినా ఇంగ్లీషు రాదని విద్యార్థిని వెక్కిరించిన లెక్చరరుకు ఎంతమాత్రం ఇంగ్లీషు వచ్చునో పరీక్ష పెడ్తే బాగుండేది!" అన్నాన్నేను.

"ఏమోనక్కా! ఇప్పుడు ఇంగ్లీషు రాకపోతే కంప్యూటరు చదువు దండుగేనంటున్నారు. విదేశాలకు పోవాలంటే ఇంగ్లీషు తప్పనిసరి అయె! ఇప్పుడు గవర్నమెంటు స్కూళ్ళల్లోనూ ఇంగ్లీషు మీడియంలు పెడ్తారట! అందరికీ అందుబాటులోకి తెస్తారట. ఒకవైపు మాతృభాషలో బోధన జరిగితే విషయ అవగాహన పెరుగుతుందంటారు. ఇంకోవైపు ఇంగ్లీషు మీడియంలంటారు నాయకులు! సరే! ఇంతకూ మా కాలంలో ఈ కంప్యూటర్ల చదువులు లేవుగద? కంప్యూటర్లు అని కొత్త విద్యలొస్తాయి... ఇంగ్లీషు అవసరమౌతుందని కలలు గన్నామా చెప్పు అక్కా! అందుకే వాణ్ణి తెలుగులో చదివించాం! దేశభక్తి మాతృభాషాభిమానమని ఉత్త ఆశలకు పోయాం. వాడి భవిష్యతును బుగ్గిలో కలిపాం!.." అని వెక్కి వెక్కి ఏడ్చింది అనుసూర్య.

"అయ్యో అనూ! ఇందులో అంతగా ఏడ్చేంత కష్టమేమొచ్చింది నీకిప్పుడు. ప్రసాద్ భాషలో ఎట్లా వున్నా కంప్యూటరు విద్యలో మంచి అవగాహన వుంది. తెలివిగలవాడు. భాషదేముంది? నేర్చుకుంటాడు! అయినా మనదేశంలో ఇంగ్లీషు భాషను గురించి చెప్పాలంటే రెండు రకాల మనుషులున్నారు. ఒకరేమో ఇంగ్లీషు మన భారతీయ భాషే అంటారు. చిన్నప్పట్నుంచి ఇంగ్లీషులో చదవటం మాట్లాడటం చేస్తుంటారు. అలవోకగా తమ మాతృభాష అదే అన్నట్లుగా ఎప్పుడూ ఇంగ్లీషులోనే మాట్లాడేస్తుంటారు! రెండోరకం వాళ్ళు ఇంగ్లీషును పెద్దగా చదువలేరు. అసలే మాట్లాడలేరు. ఇంట్లోని వాళ్ళకు ఇంగ్లీషు భాష వాసనలుండవు. వాళ్ళు పెరిగిన వాతావరణమే వేరు. అదీగాక వాళ్ళ కుటుంబాల్లో వాళ్ళే చదువుకున్న మొదటితరం వాళ్ళయివుంటారు. వాళ్ళకేం చదువుల వాతావరణం వుండదు. అట్లాఅని వాళ్ళు తెలివిలో, సృజనాత్మకతలో తక్కువ వాళ్ళని అంచనా వేయలేం. ఇంగ్లీషు భాష వాళ్ళకు ఒక విదేశీ భాష! వాళ్ళకు ఇంగ్లీషును ఒక విదేశీభాషను నేర్పే పద్ధతిలోనే నేర్పాలె. అటువంటి ప్రత్యేకమైన పుస్తకాలుండాలి. అంతేగాని మిల్టన్ పద్యాలు షేక్స్పియర్ నాటకాలు బోధించి నీకు ఇంగ్లీషు రాదని వెక్కిరిస్తే ఏం న్యాయం చెప్పు అనూ?" అన్నాన్నేను.

"నువ్వన్నది నిజమే అక్కా! కాని ఇంత సూక్ష్మంగా ఆలోచించే సమయం ఓపిక ఎవరికుంది? మన దేశంలో విద్యావిధానం అంత ఆలోచనగా తయారుచేస్తే బాగానే వుండును. ఇన్ని అవకతవకలుండకపోవును. అయినా విద్యార్థులను వాళ్ళ విద్యావిధానాలను పట్టించుకునే అవసరమెవరికీ లేదు! బందెల దొడ్డిల్లో తోలినట్లుగా విద్యార్థులను కార్పొరేటు కళాశాలల్లో తోలేస్తున్నారు. కాలేజీల వాళ్ళకేమో డబ్బు చేసుకోవటం మీదే దృష్టి అంతా! పిల్లల మనోభావాల మీద వాళ్ళకేం దృష్టి వుంటుంది! ఏం సానుభూతి వుంటుంది చెప్పు అక్కా!" అంది అనసూర్య కండ్లు పైటకొంగుతో తుడుచుకుంటూ.

ఇప్పుడు చైనావంటి దేశాలు కూడా విద్యార్థులకు ఇంగ్లీషు నేర్పాలని ప్రయత్నిస్తున్నారు. విదేశాల్లోగాని, స్వదేశంలోగాని కంప్యూటరు రంగంలో భారతీయ విద్యార్థులు ఎక్కువగా పనిచేస్తూ రాణిస్తున్నారంటే వాళ్ళకు ఇంగ్లీషు ధారాళంగా రావటమే కారణమని చైనావాళ్ళు కనిపెట్టారు. దాంతో వాళ్ళు ఇంగ్లీషుమీద దృష్టి పెడ్తున్నారు. అయితే వాళ్ళు వాళ్ళ విద్యార్థులకు ఇంగ్లీషును ఒక విదేశీభాషను నేర్పే పద్ధతిలో నేర్పుతున్నారు. మనలాగా మిల్టన్, షేక్స్పియర్‌లతో కాదు". అన్నాన్నేను. "అయినా అక్కా! ఇంగ్లండులో గాని, అమెరికాలోగాని మిల్టన్, షేక్స్పియర్ల ఇంగ్లీషుభాష పాతబడిందట గద! మనమెందుకు ఇంకా వాట్నే చదువుతున్నాం!" అంది అనసూర్య ఆశ్చర్యపోతూ.

"అదే వచ్చిన కష్టం అనూ! ఇంగ్లీషును విద్యార్థులకు ఒక విదేశీభాషను నేర్పే విధానంలో బోధించటం జరగాలె. ఒకవేళ ఇంగ్లీషు బాగా తెలిసిన విద్యార్థులుంటే అప్పుడు రాని వాళ్ళకు వేరే అదనపు క్లాసులు పెట్టి ఇంగ్లీషు భాషను శాస్త్రీయపద్ధతిలో నేర్పాలె! అయినా ఇంగ్లీషు మనకు స్కూలు నుంచే కంపల్సరీ విషయమే కాబట్టి ప్రతి విద్యార్థికి అంతో ఇంతో ఇంగ్లీషు తప్పకుండా తెలుసును. కాబట్టి అదనపు క్లాసులు పెట్టి ఇంగ్లీషు భాషలో ఎక్కువ పరిచయం లేనివాళ్ళకు ఇంగ్లీషు భాషను నేర్పే వసతి కల్పించాలె! చిన్న తరగతుల్లో కూడా ఇంగ్లీషు భాషను ఒక విదేశీ భాషను నేర్పే క్రమంలోనే నేర్పాలెకాని పాటలు పద్యాలతో కాదు! ఇంగ్లండులో వుండి ఇంగ్లీషు రాదా నీకు అన్నంత నీచంగా విద్యార్థులతో ప్రవర్తించటం సరైన పద్ధతి కాదు అనూ!" అన్నాన్నేను. అనసూర్య అవునన్నట్లుగా తలూపింది చిరునవ్వుతో. ★

నిజమైన స్నేహం

పెండెం జగదీశ్వర్

వెల్లంకి గ్రామంలో నరసింహం గొప్ప శ్రీమంతుడు. ఆయన ఏకైక సంతానం వెంకటరమణ. యుక్తవయసు వచ్చిన వెంకటరమణకు చాలామంది స్నేహితులు వుండేవారు. వాళ్లలో కొంతమంది ఎల్లప్పుడూ అతని చుట్టే తిరుగుతుండేవారు. కానీ... వారి స్నేహితుల గురించి నరసింహానికి సందేహంగా వుండేది. వాళ్లంతా డబ్బు చూసి అతనితో స్నేహం చేస్తున్నారనిపించింది. వెంకటరమణ కూడా మిత్రుల కోసం విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేసేవాడు.

ఓసారి నరసింహం కొడుకుతో, "నీ స్నేహితులతో జాగ్రత్తగా వుండు. నిజమైన స్నేహితులను గుర్తించి మసలుకో" అన్నాడు.

అందుకు వెంకటరమణ, "లేదు నాన్నా! నేను జాగ్రత్తగానే వుంటున్నాను. వాళ్లంతా చాలా మంచి వాళ్లు. నాతో తప్ప ఇంకెవరితో సన్నిహితంగా మెలగరు. చాలా విషయాల్లో నాకు సాయం చేస్తుంటారు" అని చెప్పాడు. అయినప్పటికీ వారిమీద ఆయనకు అనుమానంగానే వుంది. సమయం వచ్చినప్పుడు నిజమైన స్నేహం ఎలా వుంటుందో కొడుకుకు తెలియజెప్పాలని నిర్ణయించుకున్నాడు నరసింహం.

ఓ రోజు మధ్యాహ్నం భోజనం చేశాక తీరిగ్గా కూర్చున్నాడు నరసింహం. వెంకటరమణ లోపలి గదిలో చదువుకుంటున్నాడు. అంతలో వెంకటరమణ స్నేహితుడు రవి వాళ్లింట్లోకొచ్చాడు. వస్తూనే వెంకటరమణతో, ''ఆ రాజుగాడు పనికిరాడురా! నేనిక వాడితో జన్మలో స్నేహం చేయకూడదని నిర్ణయించుకున్నా'' అన్నాడు.

''ఏమైందిరా?'' అనడిగాడు వెంకటరమణ.

"అర్జంటుగా వంద రూపాయలు కావలసి వచ్చాయి. రెండు రోజుల్లో తిరిగి ఇచ్చేస్తాను ఇవ్వరా అంటే నన్ను నమ్మలేదు" అని చెప్పాడు రవి.

"అలాగా!" అన్నాడు వెంకటరమణ.

''నరేగానీ! కనీసం నువ్వైనా ఇవ్వరా. చాలా అవసరం" అనడిగాడు రవి మెల్లగా.

"దానిదేముంది తీస్కో....' అంటూ రవికి వంద నోటు అందించాడు వెంకటరమణ. "థాంక్స్‌రా రమణా" అంటూ సంతోషంగా వెళ్లిపోయాడు రవి.

ఆ దృశ్యం చూసిన నరసింహం వెంకటరమణతో, "కేవలం డబ్బు ఇవ్వలేదనే కారణం వల్ల రాజు స్నేహాన్ని వదులుకుంటున్నానన్న నీ మిత్రుడు రవి తత్వం గురించి ఆలోచించు. రేపు నువ్వు కూడా డబ్బు ఇవ్వకపోతే నిన్ను కూడా ఇలాగే అనహ్యించుకుని నీ స్నేహాన్ని కూడా వదిలేస్తాడు. ఇది అవసరాల కోసం చేసే స్నేహం తప్ప నిజమైన స్నేహం కాదు. ఇకమై మిత్రుల కోసం డబ్బు ఖర్చు చేయడం మానెయ్. కొద్దిరోజుల్లోనే నీకు నిజమైన మిత్రులు ఎంతమంది వున్నారో తెలుస్తుంది" అని చెప్పాడు.

తండ్రి మాటలు యదార్థాలని గ్రహించాడు వెంకటరమణ. ఆపై తండ్రి చెప్పినట్లే చేశాడు. సగానికి పైగా అతనితో స్నేహం మానుకున్నారు. అటు తర్వాత నిస్వార్థంగా స్నేహం చేసే కొంతమందినే తన మిత్రులుగా ఎంచుకున్నాడు వెంకటరమణ.



చిన్నారి చిత్రకారులు

కె.నిఖిల్, 4వ తరగతి, సెయింట్ ఆంథొనీస్ హైస్కూల్, హిమాయత్ నగర్, హైదరాబాద్.



ఎస్.సాయికుమారి, 9వ తరగతి, ఎమ్. ఆర్. కె. జడ్. పి. హెచ్ స్కూల్, వీరవాసరం.

వేముల శిల్ప, 10వ తరగతి, శ్రీ శాంతినికేతన్ స్కూల్, పెనుబల్లి, ఖమ్మం.



ఆ పదిహేను ఎక్కడున్నాయి?

చిన్నారులూ... పై బొమ్మలో ఓ వ్యక్తి వున్నాడు కదా. అతనికి, అతని చుట్టూ వున్న పరిసరాలకు ఒక ప్రత్యేకత వుంది. అదేంటంటే... అక్కడ మొత్తం పదిహేను వస్తువులు వున్నాయి. ఏంటి నమ్మ బుద్ధి కావడం లేదా? అయితే ఒక్క ఉదాహరణ చెప్తామే. అతని నడుముకు వాచ్చీ వుంది. అవునా! ఇలా మిగతా పద్నాలుగు వస్తువులు ఎక్కడ వున్నాయో మీరు కనిపెట్టేయాలి. అన్నట్టు మర్చిపోయాం. వాటిలో ఒక పక్షి తల కూడా వుంది మరి గబగబా చూసినదాన్ని చూసినట్టు పెన్సిల్‌తో సున్నా చుట్టండి.

జవాబు కావాలంటే పుస్తకం తిరగేసి చూడండే.

గుండె, కిరీటం, స్పూను, పేపర్ క్లిప్, రంపం, టూత్ బ్రష్, కప్పు, సాసర్,
గద్ద తల, అరటిపండు, వాచ్చీ, ఆర్టిస్టు బ్రష్, గాలిపటం, ఈక, దువ్వెన,

❄

వి'చిత్రం'



చిట్టి పిల్లలూ! ఇవాళ మీకోసం వచ్చిన వి'చిత్రం' చూశారుగా. కొంత మంది చిన్నారులు ఒక పజిల్‌ను పూరిస్తున్నారు. అదేనర్రా! ఒక బొమ్మ ముక్కలు ముక్కలు చేసి వుంటుంది. దాన్ని సరిగ్గా అమర్చాలి. అదన్నమాట. దాన్ని పిల్లలు అమరుస్తున్నారు. ఇంతకీ అసలు ఈ పజిల్‌కు మొదలు, చివర ఎక్కడ? అనేది మీరు కనిపెట్టాలి. ఏంటి అలా తికమకగా చూస్తున్నారు?

అసలు బొమ్మ చూస్తుంటే ఎవరు పిల్లలు? ఎవరు బొమ్మలో పిల్లలు? అనేది అర్థం కావడంలేదుకదూ. మరదే ఆర్టిస్టు అంకుల్ గొప్పతనం. అందుకు చప్పట్లు చరిచి ఆయనకు అభినందనలు చెప్దామా! మీరుకూడా ఇలాంటి మంచి మంచి బొమ్మలు వెయ్యగలగాలి. ఓకేనా! ❄

బాలనేస్తాలు

వీరి వీరి గుమ్మడిపండు...

వీరి పేరేమి?

నేస్తాలూ! ఈ వారం మీ ముందుకు వచ్చిన వ్యక్తి మీకు చాలా చాలా బాగా తెలుసు. ఈయనను జాతిపిత అని కూడా పిల్చుకుంటాం. మరి ఆయనెవరో కార్డుమీద రాసి మాకు పంపండి. మీ పేరు, తరగతి, ఊరు ప్రచురిస్తాం. మా చిరునామా: వీరివీరి గుమ్మడిపండు వీరిపేరేమి? బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాదు.

సరైన సమాధానాలు రాసినవారు

(బ్రాకెట్‌లోని అంకె వారు చదువుతున్న తరగతి) జి.సాయికిరణ్ (4), జి.హరీష్‌కుమార్‌గౌడ్ (2), జి.శివకుమార్ (7), మార్టూర్. డి.రజిత (4), జన్నారం. పి.కోటయ్య (9), ఎం.కామేశ్వరరావు, ఎన్.నారాయణరావు, పేర్నమిట్ట. ఎ.పూర్ణచందర్ (8), పెద్దాపూర్. వి.సౌమ్య (5), వి.గాజావంశీధర్ (7), ఈమని. పి.రఘు (9), పొగళ్ళపల్లి. పి.మాధురి (1), విశాఖపట్నం. డి.శ్రావణి డి.దేవేంద్రకుమార్ (9), విజయవాడ. కళ్యాణిబాబు, దమ్మపేట. బి.వినోద్‌కుమార్, విప్పలమడక. బి.భానుచందర్, ధనవాయ్‌గూడెం. ఎ.సాహిత్యలోహిత (3), ఎ.శరత్‌చంద్ర (1), పాలకొల్లు. పి.వృధ్వి (10), పి.జయశ్రీ (7), చిలకలూరిపేట. పి.సందీప్ విలియం (6), పాడేరు. ఎం.సాయి వీరేంద్ర (4), కొవ్వూరు. ఎం.ధనాకర్ (9), చిన్నగొట్టిగల్లు. కె.హజరత్ అలీ మీర్‌ఖాన్, కె.రంజాన్‌వలి (9), వెలిగండ్ల. కె.రవికౌశిక్ (4), హస్తినాపురం. కె.శ్రీ అనూహ్య (6), గుంటూరు. ఎస్.శ్రీకర్ (4), హైదరాబాద్.పూజారి ఉపేంద్ర, (8) విశాఖ. వి.శ్రీనివాస్, (9) కారేపల్లి, ఖమ్మం. టి.వి.సాయి కిరణ్మయి, (6) వెన్నుతల, డి.కల్పలత, (9) బెల్లంపల్లి, ఆదిలాబాద్. ఎ.ప్రవీణ్‌కుమార్, (8) చందోలు. సి.హెచ్.గంగాధర్, (9) నక్కబొక్కలపాడు. బి.రజిత, (10) బెల్లంపల్లి, ఆదిలాబాద్, అల్లూరి హేమంత్, (9) ఏలూరు, ఎం.గౌతమ క్రాంతి, (7) దామరమడుగు, నెల్లూరు, కొమర కాంచన, (8) భీమునిపట్నం, ఎల్.రామలక్ష్మి, (8) భీమునిపట్నం, కట్టమూరి అనిత, (8) భీమునిపట్నం, శ్రీమంతుల లావణ్య (8) భీమునిపట్నం, డి.అనూష, (8) భీమునిపట్నం, పెద్దాడ దొరబాబు, (4) కొయ్యూరు. ఎల్.ప్రదీప్, (4) అశ్వారావ్‌పేట, ఖమ్మం.

❋

గత వారపు జవాబు
కారల్ మార్క్స్

తేడాలు కనుక్కోండి



పిడుగులూ! బొమ్మలో మీకంటే మాంచి చురుకైన కుందేళ్లు రెండు వున్నాయర్రా! కాకపోతే వీటికి అస్సలు పడదు కాక పడదు. అన్నిట్లోను పోటీ పడుతుంటాయి.

ఓసారి ఏమైందంటే... ఇవి ఫ్యాన్సీ డ్రస్ పోటీలో పాల్గొనాలనుకున్నాయి. అందుకని ఎంచక్కా ఒకేలా రెడీ అయ్యాయి. కాదు అయ్యాయనుకున్నాయి. కానీ రెంటిల్లోను కొన్ని తేడాలున్నాయి. వాటిలో కనీసం ఆరు బేధాలనైనా మీరు గుర్తించాలి. మరి పెన్ను తీసుకుని బుర్రకు పనిపెట్టండి.

❋

ఫొటో పువ్వు

హాయ్ చిన్నారులూ... ఇవాళ మీకు ఎంతో ఇష్టమైన బొమ్మ తయారు చేయడం ఎలాగో చెప్పాలనుకుంటున్నాం. మీరు ఎప్పుడో ఒకసారి ఫొటో దిగి వుంటారుకదా. దాన్ని అందంగా తయారుచేసి గోడకు తగిలించే ఉపాయం ఒకటి మా దగ్గర వుంది. అదే ఫొటో పువ్వు. మరి చెప్పేసుకుందామా?

ఏమేం కావాలంటే... మీ ఫొటో (తల వరకు చాలు), మందపాటి తెల్ల కాగితాలు, స్కెచ్ పెన్నులు, గమ్, ప్యాడ్, వాటర్ కలర్స్, కత్తెర, పెన్సిల్.



ఎలా చెయ్యాలంటే... ముందుగా మీరు బాగా చిన్న పిల్లల చేతి ముద్రలు తీసుకోవాలి. ఎలాగంటే... వారి చేతికి ఆకుపచ్చ వాటర్ కలర్ పూసి చక్కగా మందపాటి కాగితం మీద అద్దండి. అంతే వారి చేతి ముద్ర పడిపోతుంది. దీన్ని చక్కగా కత్తిరించాలి. ఎలాగంటే... ముద్ర చుట్టూ జాగ్రత్తగా కట్ చేయాలి. ఇలాంటి ముద్రలు రెండు కావాలి. ఇవి ఆకులన్నమాట.



పువ్వు రేకులు తయారుచేసుకోవాలి. అవి కూడా ఆకుల సైజుకు తగ్గట్టుగా మందపాటి తెల్లటి చార్టుమీద గీసుకుని కత్తిరించుకోవాలి. తర్వాత వాటికి మీకు నచ్చిన నిండు రంగులు వెయ్యాలి.

తర్వాత ఏం చేయాలంటే... మీరు ఎంత ఫొటో పువ్వు చెయ్యాలనుకుంటున్నారో ... అంత చార్టు తీసుకోవాలి. దానిమీద పువ్వు రెక్కలు అతికించాలి. పువ్వుకు, ఆకులకు మధ్యలో కొమ్మ వుంటుందిగా. అందుకని కాస్త ఖాళీ వుంచి ఆకులు అతికించాలి. ఆకులంటే చేతిముద్రలన్నమాట. ఇహ పువ్వుకి, ఆకులకు మధ్య పెన్సిల్‌తో కొమ్మ గియ్యాలి. తర్వాత దానికి ముదురు ఆకుపచ్చ రంగు అద్దాలి.

చివరిగా పువ్వు మధ్యలో మీ అందమైన ఫొటోని తల వరకు గుండ్రంగా కత్తిరించి అతికించాలి. అంతే మీరు కోరుకునే ఫొటో పువ్వు సిద్ధమైపోయినట్టే. దీన్ని ప్యాడ్‌కి అతికించి ఎంచక్కా గోడకు తగిలించుకోవచ్చు.

నచ్చేసిందా? మరైతే ఇప్పుడు పరీక్షలు కదా. అవన్నీ అయిపోయాక ఆరాంగా కూర్చుని చేసెయ్యండే. ఈ పుస్తకాన్ని మాత్రం జాగ్రత్త చేసుకోవడం మర్చిపోకండే.

❋

పితృదేవోభవ

పొత్తూరి రాజేంద్రప్రసాద్‌వర్మ

ఉదయ కిరణాలు విచ్చుకోలేదు.

సూర్యోదయం అయినప్పటికీ ఆకాశంలో మేఘాలు సూర్యుని చుట్టూ ముసురుకోవడంతో వాటిని చీల్చుకుని బైటపడటానికి సూర్య కిరణాలు పోటీ పడుతున్నాయి.

దూరంగా ఎడ్లబళ్ల నడక... ఎద్దుల మెడల్లో మువ్వల సవ్వడి లయబద్ధంగా వినిపిస్తోంది.

రైతులు చాలామంది పొలాలకు వెళ్లిపోయారు.

దూరంగా మంచినీళ్ల బావివద్ద ఆడవాళ్ల మాటలు గట్టిగా అరుపుల్లా వినిపిస్తున్నాయి.

పల్లె దాదాపుగా నిద్రలేచిపోయింది.

అయిదేళ్ల జొన్నలగడ్డ విజయలక్ష్మి ఎప్పుడో నిద్రలేచింది.

ముందురోజు రాత్రి తల్లిదండ్రుల కబుర్లు ఆమె మదిలో మెదులుతూనే ఉన్నాయి. ఆ రోజు పాఠశాలలో చేరాలి. మంచి ముహూర్తం చూసుకుని నిర్ణయించారు. కొత్త పలక కొన్నారు. తోటి పిల్లలకు పంచడానికి చాక్‌లెట్లు, పలకపుల్లలను రప్పించారు.

తండ్రి తీసుకువచ్చిన సామానులన్నింటినీ ముచ్చు సంచిలోపెట్టి గోడకున్న మేకుకు తగిలించాడు.

విజయలక్ష్మి రాత్రి నిద్రపోయేముందు ఆ సంచిని చూసింది. ఉదయం ఎవరూ లేవకముందే లేచి ఆ సంచీ అలాగేఉందో లేదో చూసుకుంది.

తర్వాత గబగబా తయారైపోయింది.

కొత్తగా బడిలో చేరాలని అనుకోవడం ఆ పాపకు గొప్ప ఆనందాన్ని కలిగించింది. ఇతర పిల్లల మాదిరి తనుకూడా చదువుకోగలనని ఆమెకు బలంగా అనిపించింది.

అందుకే ఎంత తొందరగా బడికి వెళ్లాలా అని ఆతృత పడిపోయింది. ఊరు లేవకముందే తను నిద్రలేచింది.

"నాన్నా! స్కూలు బెల్లు కొట్టేస్తారు... తయారవ్వు!" తండ్రిని కూడా ఉత్సాహపరిచింది.

జొన్నలగడ్డ రామిరెడ్డి చిన్నగా నవ్వాడు.

"పర్వాలేదమ్మా! మనం ఈ రోజు స్కూల్లో చేరుతున్నాం. ఏ సమయానికైనా వెళ్లవచ్చు! అయినా నేను తయారైపోయానులే!" పనులను ముగించుకున్నాడు.

తర్వాత స్కూలుకు బయలుదేరారు.

వారంరోజులుగా తయారు చేయించిన చెక్కబండిని ఇంటిముందు తీసుకువచ్చి పెట్టాడు. చిన్నపిల్లలు ఆడుకునే మూడు చక్రాల బండిలా ఉంది. అయితే ఈ బండిలో కూర్చోవడానికి కూడా అవకాశం ఉంది. ముందుకు నడవడానికి చక్రాలను కూడా బిగించారు.

విజయలక్ష్మి దేక్కుంటూ ఇంటిలో నుంచి వచ్చి కూర్చుంది.

రామిరెడ్డి గోడకు తగిలించిన ముచ్చుసంచిని తీసుకుని చేతిలో పట్టుకున్నాడు. తర్వాత బండిని తోసుకుని ముందుకు కదిలాడు.

నల్గొండ జిల్లా గూడూరు గ్రామం

గ్రామం చిన్నదే అయినప్పటికీ అందుబాటులో పాఠశాల ఉంది.

స్కూలు ముందు చెక్కబండి ఆగిన సమయంలో పిల్లలందరూ ప్రార్థన చేస్తున్నారు. అంతవరకూ బైట ఉండిపోయి పిల్లలందరూ తరగతి గదుల్లోకి వెళ్లిపోయిన తర్వాత హెడ్మాస్టరు వద్దకు వెళ్లాడు.

"మా అమ్మాయిని పాఠశాలలో వేయాలి". అంటూ వివరాలు చెప్పాడు.

అతను అడ్మిషన్ రిజిస్టర్‌లో వివరాలన్నీ రాసుకున్నాడు. ప్రవేశ దరఖాస్తులో రామిరెడ్డితో సంతకం చేయించుకున్నాడు.

తర్వాత ఎత్తుకుని తరగతి గదిలో కూర్చోబెట్టాడు.

సాధారణంగా పాఠశాలలో ఒకటవ తరగతిలో ఎవరు చేరినా పిల్లలందరికీ స్వీట్లు పంచి పెడుతుంటారు.

ఈ అమ్మాయి ఏమి తెచ్చిందా అని మిగిలిన పిల్లలు ఆశగా చూస్తుంటే... నడవలేని ఆమె అవిటితనాన్ని మరికొంతమంది వింతగా చూశారు.

ఇంతలో రామిరెడ్డి తరగతిలో పిల్లలందరికీ చాక్‌లెట్లు, పలకపుల్లలను పంచాడు. తర్వాత క్లాసు టీచరు వద్దకు వచ్చి ఆమెకు గుప్పెడు చాక్‌లెట్లు అందించాడు...

"మా అమ్మాయికి చదువుకోవాలంటే చాలా ఇష్టం. ఆరేడు నెలల నుంచి స్కూల్లో చేర్పించమని ఒకటే గొడవ. అయిదేళ్లు నిండలేదని నేనే తీసుకురాలేదు" అన్నాడు.

"అవిటిపిల్లను రోజూ తీసుకురావడం కష్టం కదా?"

"పర్వాలేదు. రోజూ నేనే తీసుకువచ్చి దిగబెడతాను. మా పాప కోసం ప్రత్యేకంగా కర్రబండి కూడా తయారుచేయించాను..." అన్నాడు రామిరెడ్డి.

రామిరెడ్డి చెప్పిన జవాబు విని క్లాసు టీచరు ఏమీ మాట్లాడలేదు.

తర్వాత రామిరెడ్డి అక్కడి నుంచి సెలవు తీసుకుని ఇంటికి వచ్చేశాడు.

అప్పటినుంచి అయిదేళ్లపాటు కూతుర్ని బడికి తీసుకువెళ్లడం, తీసుకురావడం నిత్యకృత్యం అయిపోయింది. ఆమె అయిదవ తరగతి పాసైనంతవరకూ కర్రబండి ఎంతగానో ఉపయోగపడింది.

✵ ✵ ✵

జొన్నలగడ్డ విజయలక్ష్మికి పదేళ్లు.

అయిదవ తరగతి చదువు పూర్తయిపోవడంతో ప్రాథమికోన్నత పాఠశాలలో చేరవలసి వచ్చింది. ఆ గ్రామంలో యు.పి. స్కూలు లేనందువల్ల పక్క గ్రామం వెళ్లవలసి వచ్చింది.

రామిరెడ్డి వెంటనే ఆమెను యు.పి. స్కూల్లో చేర్పించాడు.

రోజూ సైకిలుపై ఎక్కించుకుని నాలుగు కిలోమీటర్లు తొక్కుకుని వెళ్లి స్కూల్లో దించేవాడు. సాయంత్రం మళ్లీ వెళ్లి తిరిగి తీసుకుని వచ్చేవాడు. మధ్యాహ్నం భోజనం చేయడానికి లంచ్‌బాక్సును సిద్ధం చేసేవాడు.

ఆ గ్రామంలో తొమ్మిదవ తరగతి వరకూ పూర్తి చేసింది.

పదవ తరగతి చదవడానికి అవాంతరాలు ఎదురయ్యాయి. అందువల్ల ఇంటివద్దనే ఉండి చదువుకోవాలని నిర్ణయించింది.

ఆ ప్రకారం ప్రైవేటుగా ప్రిపేర్ అయింది.

టీచర్లు చెప్పే విషయాలకన్నా ఇతర విషయాలను సబ్జక్టులలో కొత్త అంశాలను తెలుసుకుని చదవడం

ప్రారంభించింది. పరీక్షల్లో అంతకుముందు సంవత్సరాలకు సంబంధించి ప్రశ్నాపత్రాలను సంపాదించి వాటిని చదివింది.

పరీక్షా కేంద్రానికి సైకిల్‌పై తీసుకుని వెళ్లేవారు.

అన్ని పరీక్షలను బాగారాసింది.

చదువుపై ఉన్న విపరీతమైన శ్రద్ధ కారణంగా మంచి మార్కులతో పాసైంది. ఫలితాలు వెలువడిన రోజు విజయలక్ష్మి సంతోషానికి అవధులు లేకుండా అయిపోయాయి.

ఇంటర్ చదవడానికి కూడా వెనుకాడలేదు.

ఆడపిల్లలకు చదువు ఎందుకులే అని ఇరుగుపొరుగువారు కొంతమంది నిరాశపరిచేవారు. అయినా విజయలక్ష్మి ఎవరి మాటలను లెక్కచేసేదికాదు.

మిర్యాలగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్‌లో చేరింది.

పిల్లందరూ బెంచీలపై కూర్చుంటే విజయలక్ష్మి ప్రతిరోజూ బెంచీపై కూర్చోవడానికి అవస్థపడేది. అయినప్పటికీ ఆమె ఎప్పుడూ నిరాశ పడలేదు.

రోజూ తండ్రి సైకిల్‌పై తీసుకువచ్చి తిరిగి తీసుకువెళ్లేవాడు.

చిన్నతనంలో పోలియో కారణంగా రెండు కాళ్లూ నడవడానికి ఏ మాత్రం సహకరించకపోవడంతో ఆమె దేక్కొని నడిచేది. నడవడానికి రెండు చేతులను ఉపయోగించేది. చేతులపైనే ఎక్కువ బలం ఉండటంవల్ల అవి అరిగిపోకుండా ఉండేందుకు చేతి తొడుగులను ఉపయోగించేది.

కాలేజీ అంటే టీనేజి పిల్లల రంగుల ప్రపంచం.

ఎంతోమంది ఎన్నో ప్రాంతాలకు చెందిన పిల్లలు కాలేజీకి వచ్చేవారు. అయినప్పటికీ విజయలక్ష్మి తన పని తప్ప ఏమీ పట్టించుకునేది కాదు. లెక్చరర్లు చెప్పిన విషయాలను జాగ్రత్తగా పుస్తకంలో నోటు చేసుకునేది.

ఇంటర్మీడియెట్‌లో మంచి మార్కులతో పాసైంది.

డిగ్రీ చదువుతానని పట్టుపట్టింది.

ఇంటిలోవారు, ఇరుగుపొరుగువారు అభ్యంతరం చెప్పారు. "డిగ్రీ కాలేజీకి వెళ్లాలంటే నల్గొండకు వెళ్లాలి. అంతదూరం అవిటితనంతో దేక్కుంటూ వెళ్లడం కష్టం అవుతుంది. అయినా డిగ్రీ చదివి ఏమి చేయాలి?" అని ప్రశ్నించారు.

"ఎవరు ఏమి అనుకున్నా చదువుతాను!"

"పోనీ దూరవిద్య ద్వారా చదవవచ్చు కదా?"

"దూరవిద్య అంటే ఇంటిలో కూర్చోవాలి. ఎప్పుడో పరీక్షలకు మాత్రమే వెళ్లాలి. అది నాకు ఇష్టంలేదు. అందరి ఆడపిల్లల మాదిరిగా నేనూ కాలేజీకి వెళతాను. ఇంటర్ చదివిన మాదిరిగానే డిగ్రీ కూడా పూర్తి చేస్తాను..." విజయలక్ష్మి దృఢంగా చెప్పింది. ఆమె మాటల్లో ఆత్మవిశ్వాసం తొంగి చూసింది.

ఆమెకు ఎవరూ ఎదురు చెప్పలేకపోయారు.

"అమ్మా! నీకు చదవాలని, కాలేజీకి వెళ్లాలని ఉంటే ఎవరూ అడ్డు చెప్పరు. నిన్ను ప్రోత్సహించడానికి చదివించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటాను" రామిరెడ్డి చెప్పాడు.

ఆ తర్వాత నల్గొండ మహిళా కాలేజీలో విజయలక్ష్మి డిగ్రీలో చేరింది. గూడూరు నుంచి ప్రతిరోజూ వెళ్లి రావడానికి ఆమె తండ్రి ప్రత్యేక ఏర్పాటు చేశాడు. కాలేజీకి వెళ్లడానికి ఎటువంటి ఇబ్బందులు ఏర్పడలేదు.

మూడేళ్లు గడిచిపోయాయి.

విజయలక్ష్మి చేతికి డిగ్రీ వచ్చింది.

ఆ రోజు ఆమె ఎంతో సంతోషించింది.

పోస్టు గ్రాడ్యుయేషన్ చదవాలని అనుకుంది.

కాని సమీపంలో కాని, జిల్లాలోకాని అటువంటి అవకాశం కన్పించలేదు. పి.జి. కాలేజీలు అందుబాటులో లేనందువల్ల దూరవిద్యావిధానంలో ఎం.ఎ. కట్టింది.

పోస్టులో వచ్చే పాఠాలను శ్రద్ధగా చదివింది.

సమీపంలో ఉన్న పరీక్షా కేంద్రంలో పరీక్షలు రాసింది. ఆమె అనుకున్న విధంగానే ఫలితాల్లో మంచి మార్కులు వచ్చాయి.

ఇంట్లో వాళ్లందరూ పొంగిపోయారు.

"అమ్మా! విజయా నువ్వు అనుకున్న విధంగా చదువుని పూర్తి చేశావు. ఇంకా చదవాలంటే డబుల్ ఎమ్మే చేయాలి లేదా డాక్టరేట్ చేయాలి. చేస్తావా?" ఆ రోజు తండ్రి అడిగాడు.

విజయలక్ష్మి వెంటనే ఏం సమాధానం చెప్పలేకపోయింది. తర్వాత నెమ్మదిగా "నాన్నా! నాకోసం నువ్వు ఎంతో కష్టపడ్డావు. నా భారాన్ని ఇంతకాలం మోశావు. ఇంకా చదువుతూ నీకు భారం కాదలుచుకోలేదు!"

"అయితే ఏం చేస్తావు?"

"ఉద్యోగం చేస్తాను. మన కుటుంబానికి చేయూతగా ఉంటాను. ఇంకా పెద్ద చదువులు చదవడంవల్ల ఉపయోగంలేదు..." నెమ్మదిగా అంది.

"ఏం చేస్తావమ్మా! చదువుల సరస్వతివి... అయినా నీకు ఉద్యోగం వస్తుందా?"

"తప్పకుండా వస్తుంది నాన్నా! నా చదువు కోసం నువ్వెంతో కష్టపడ్డావు. నీలాంటి తండ్రి దొరకడం నా అదృష్టం. నాలా చదువుకోవాలనుకున్న వారికి ఆదర్శంగా టీచర్‌ని అవుతాను. గురుబ్రహ్మగా ఎంతో మందిని తీర్చిదిద్దుతాను..." అంది.

ఆమె ఆలోచనలు కార్యరూపంలోకి తీసుకువచ్చింది. బి.ఇడి ఎంట్రన్స్ పరీక్షకు హాజరైంది.

కృషి, పట్టుదల... దీక్ష ఆమెకు మార్గాన్ని చూపించాయి. ఆంధ్రమహిళా కళాశాలలో బి.ఇడి. సీటు వచ్చింది.

శ్రద్ధగా చదివింది. బి.ఇడి పాసైంది.

ఆ తర్వాత ఉపాధ్యాయ ఉద్యోగం కోసం ప్రయత్నించింది. డి.ఎస్.సి. పరీక్ష రాసింది. మంచి రాంకు సంపాదించింది. ఫలితంగా ఉద్యోగం విజయలక్ష్మిని వరించింది.

2001 సంవత్సరంలో పోస్టింగ్ లభించింది.

నల్గొండ జిల్లా దామరచర్ల మండలంలో 'రాళ్లవాగుతండా' ప్రభుత్వ పాఠశాలలో ఉద్యోగం లభించింది.

తను నివశించే గూడూరు నుంచి నేరుగా బస్సు సదుపాయం ఉండటంతో ఉద్యోగంలో చేరిపోయింది. గిరిజన తండాలో చిన్నపిల్లలు ఆమె రాకతో కేరింతలు కొట్టారు. తనకు ఇష్టమైన ఉద్యోగంలో చేరినందుకు విజయలక్ష్మి ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయింది.

❋ ❋ ❋

రాళ్లవాగుతండా ప్రాథమిక పాఠశాలలో పిల్లలందరూ వరుసగా నిల్చున్నారు. బడి విడిచిపెట్టేముందు కలిసికట్టుగా జనగణమన గీతాన్ని పాడి వెళ్ళిపోతుంటారు.

విజయలక్ష్మి అందరినీ క్రమశిక్షణలో పెట్టింది.

జనగణమన తర్వాత పాఠశాల అయిపోయింది.

గదులకు తాళాలు వేయించి బస్సు ఆగే ప్రాంతానికి కష్టంపైన నడుచుకుని వచ్చింది.

సాయంత్రం నాలుగు గంటలకు ఆ ప్రాంతానికి వచ్చే బస్సుకోసం విజయలక్ష్మి రావడం... ఆమెకు తోడుగా పిల్లలు వెళ్లడం గ్రామస్తులకు రోజూ కనిపించే దృశ్యమే.

చేతులతో నడవడం... సక్రమంగా రోజూ బడికి వచ్చి విధి నిర్వహణ చేయడం. విద్యార్థులందరినీ క్రమశిక్షణలో పెట్టడం... పాఠశాలను గతంలో కన్నా అభివృద్ధి చేయడంతో తండాలోని ప్రజలకు ఆమె అంటే ఎంతో ఇష్టం. కొంతమంది బడిపిల్లల తల్లులు కూడా ఆమె కూడా వచ్చి బస్సు వచ్చేంతవరకూ ఉండి ఎక్కించి వెళుతుంటారు.

ఆరోజు నాలుగున్నర అయినా బస్సు రాలేదు.

విజయలక్ష్మికి గాబరాగా ఉంది. బస్సు నుంచి దింపుకుని ఇంటికి తీసుకువెళ్లడానికి బస్టాండులో సైకిలుతో సిద్ధంగా ఉన్న తండ్రి రూపం గుర్తుకు వచ్చింది.

ఆ రూటులో ఉన్నది ఒకటే బస్సు

దూరం నుంచి రావలసిన బస్సు రిపేర్ అయి ఆగిపోయిందని ఎవరో చెప్పారు.

విజయలక్ష్మి గుండెల్లో రాయిపడింది.

సాయంత్రం ఆరుగంటలు అయిపోయింది. చిరు చీకట్లు కమ్ముకుంటున్నాయి. ఆమె వెంట తోడుగా వచ్చిన పిల్లలు రోడ్డు నుంచి గ్రామంలోకి వెళ్ళిపోయారు. ఇద్దరు గ్రామస్తులు మాత్రం ఆ సమీపంలో టీ కొట్లో కూర్చున్నారు.

మరో బస్సుగాని ఇతర వాహనం కానీలేని ఆ మారుమూల ప్రాంతం నుంచి ఆ రోజు ఇంటికి వెళ్లాలనా అని ఆమె ఆలోచిస్తోంది. ఒకవేళ వెళ్లలేకపోతే రాత్రి ఎలా గడపాలా అని పరిపరి విధాలుగా ఆలోచనలు సాగుతున్నాయి.

"అమ్మా ఊరిలో పాల కుర్రవాడి రిక్షా ఉంది. రమ్మని చెప్పేదా?" పక్కనున్న వ్యక్తి అడిగాడు.

ఎప్పుడూ అటువంటి పరిస్థితి ఏర్పడలేదు.

ఏం సమాధానం చెప్పాలో తెలియలేదు.

ఇంతలో సైకిలు బెల్లు వినిపించింది. విజయలక్ష్మి ఉలిక్కిపడింది. చాలా సంవత్సరాలుగా వింటున్న శబ్దం.

కచ్చితంగా అది నాన్నదే. "నాన్నా! నువ్వేనా?" టీకొట్టు కర్రబల్ల మీద నుంచి అడిగింది.

సైకిలు దగ్గరికి వచ్చింది.

"బస్సుకాన్సిల్ అయిందని బస్టాండ్‌లో ఎవరో చెప్పారు. నువ్వు ఎలా వస్తావో అని గాబరా పడిపోయాను. నిన్ను తీసుకురావడానికి సైకిలు తొక్కుకుని వచ్చేశాను..." వగరుస్తూ చెప్పాడు రామిరెడ్డి.

అరవై ఏళ్ల వయసులో ఇరవై మైళ్లు సైకిలు తొక్కుకుని వచ్చిన తండ్రిని చూసి విజయలక్ష్మికి ఏడుపు వచ్చింది

"నాన్నా!" అంది జోరుగా... ఆమె కళ్ల నుంచి కన్నీళ్లుకారిన సంగతి చీకట్లో రామిరెడ్డి గమనించలేదు.

"రామ్మా ఇప్పటికే ఆలస్యం అయిపోయింది. అమ్మావాళ్లు చూస్తుంటారు..." అని ఆమెను సైకిలుపై కూర్చోబెట్టుకున్నాడు.

"చీకట్లో మళ్లీ ఇరవై కిలోమీటర్లు తొక్కగలవా?" ఆమె నోటిలోంచి మాట బైటికి రాలేదు. అతనే అన్నాడు. "కబుర్లు చెప్పుకుని నెమ్మదిగా వెళిపోదాం. గంటా రెండుగంటల్లో అంతా ఇంటికి చేరిపోతాం..." అంటూ సైకిలును భారంగా ముందుకు కదిలించాడు.

సైకిల్ వెనుక క్యారేజీపై కూర్చున్న విజయలక్ష్మి తండ్రి నడుముపై తలవాల్చి కూర్చుంది. ఆమె కన్నీళ్లు అతని షర్టుని తడుపుతూ వీపుకు చల్లగా తగులుతున్నాయి.

ఆ కన్నీళ్ల స్పర్శ అతని శరీరం గుర్తించింది.

నెమ్మదిగా సైకిల్ ముందుకు కదిలింది. ★

నువ్వోసగం... నేనోసగం... ఓకేనా!?

పి. జ్యోతి

వెయ్యిన్నోసారి మావారి తిక్క కుదుర్చాలనీ చెప్పాపెట్టకుండా మా పుట్టింటికెళ్లా పిల్లల్ని తీసుకుని. ఇంటికొచ్చారు కాబోలు అయోమయంలో పడిపోయారు నేను కనిపించక. పక్కింటికెళ్లినా ఫోన్‌చేసి మరీ వెడతానుకదా... రాగానే వేడివేడి టీలు, మంచి నీళ్ళు అందిస్తానుగా. అందుకే వెర్రిముఖం వేసుకుని దిక్కులు చూసి నేనెక్కడికెళ్ళానో తెలీక తెలిసినాళ్లందరింటికీ ఫోన్లు చేసి చివరగా బిక్కచచ్చిపోయి మా అమ్మా వాళ్లకి ఫోన్ చేశారు.

"హలో! మావయ్యగారూ! ఝాన్సీగానీ వచ్చిందా" ఆత్రంగా అడిగింది.

"ఆ వచ్చింది బాబూ! ఏవిటీ నీతో చెప్పలేదా. వుండు పిలుస్తా మాట్లాడుదువుగానీ" అంటూ నాన్నగారు నాకందించారు.

"ఝన్సూ! ఏవిట్రా నాతో ఒక్క మాటైనా చెప్పకుండా"? అబ్బో ఏం ప్రేమ ఒలక బోస్తున్నారో ఫోన్లో. "ఎందుకు చెప్పాలీ మీరు నా శ్రమను కొంచెమైనా గుర్తించారా"

"ఇదేవిటే నేనేనాడన్నా ఒక్క మాటైనా అన్నానా నిన్న, మొన్న, వారంక్రితం, నెలక్రితం, సంవత్సరం క్రితం వరకూ గుర్తు చేసుకున్నా నాకేదీ అన్నట్టు జ్ఞాపకం చేసుకున్నారావడంలేదే".

"అదికాదు నేననేది, నేను చేసే కష్టాన్ని మీరు గుర్తించడంలేదే",

"ఏవిటంతకష్టం ఏం చేశావూ" సాగదీశారు.

"చాల్లేండీ! నోట్లోవేలు పెడితే కొరకనాడికి మల్లే మాట్టాడకండీ. నాకొళ్ళు మండుతుంది. పొద్దున్నే లేచి అరవచాకిరీ చేస్తూంటే మీరేమో ఆరిళ్ళ అవతలకి వినబడేలా గుర్రుపెట్టి పడుకోవటం ఏవన్నా బావుందా, ఆ ఆరోనెంబర్ ఇంటావిడ... అదే మహాలక్ష్మమ్మ వారు ఏవందో తెలుసా... "ఏంటీ! ఝాన్సీ మీ మిక్సీ ఏవన్నా రిపేరా గరగరలాడే సౌండ్‌తో మా చెవులే పేలిపోతున్నాయి. మీరెలా భరిస్తున్నారూ" అనీ. ఛీఛీ నాకెంత సిగ్గేసిందో, అందుకే "అవునాంటీ త్వరలో రిపేరు చేయిస్తాలేండీ అన్నా. మీ గురకమూలంగా ఒక్క అబద్ధంకూడా ఆడని నేను అబద్ధం చెప్పాల్సొచ్చింది.

"అయితే ఏవిటీ నన్ను గుర్రుపెట్టి పడుకోవద్దనా? మొన్నేదో పత్రికలో చదివా. వెల్లకిలా పడుకుంటే గురకొస్తుందనీ అప్పుడు పక్కకి తిప్పితే తగ్గిపోతుందనీ. నన్ను పక్కకు తిప్పెయ్, దీనికోసం మీ పుట్టింటికెళ్లి పోవడం ఏవన్నా న్యాయంగా ఉందా".

"చూడండి! న్యాయాల పుల్లారావుగారూ, నేను చెప్పేది సవినయంగా వినండీ! ఇక్కడ మీ గురక ప్రాబ్లెమ్ కాదు. మీరు నేను పొద్దున్న లేచీ ఎన్ని పనులు చేసుకుంటున్నానూ, మీరు లేచేటప్పటికీ, ఇల్లూడవటం, వాకిలి చిమ్మటం, అంట్లు కడగటం, బట్టలుతకడం వంటచేయటం, పిల్లల్ని తయారుచేయడం."

"ఇవన్నింటికీ ఓ పనమ్మాయిని పెట్టుకోవచ్చుగా"

"నేను చెప్పేదానికి మీరడ్డు రాకండి, పనమ్మాయి మూడురోజులొస్తే ఆర్రోజులు మానేస్తోంది. ఇప్పటికి 66మందిని మార్చా. ఇహ నావల్లకాదు. ఈ మధ్య నా పనిని ఇంకా పెంచాలనీ" టి.వి.ఎస్ స్కూటీపెప్' కొన్నారా అంటే అదే నేనే పిల్లల్ని స్కూల్లో దింపి, ఆ సుందరం సూపర్ మార్కెట్‌లో నేనే సరుకులు తేవాలనీ, అలానే సంతలో కూరలు నేనే తేవాలనీ..."

"ఇది అన్యాయమే" నువ్వు ముద్దుగా దానిమీద తిరుగుతూ వుంటే చూసీ మురిసిపోవాలని కొన్నానే. అప్పటికీ అందరూ నన్నూ ఏహోయ్ సుబ్బారావ్ ఆడాళ్ళబండి కొన్నావేవిటీ అంటూ దెప్పిపొడుస్తున్నా నీ కోసం... కేవలం నీ కోసం భరిస్తూ వుంటే, దానిమీదే నేనూ తిరుగుతూ...!

"అమ్మా! ఎంత మాట మార్చుస్తున్నారూ" అంటూండగానే "అయితే ఇంతకూ ఏవిటీ నీ ఉద్దేశం నీకు మీ అమ్మావాళ్ళు ఝాన్సీ అని పేరెట్టింది నామీద నీ వీరత్వం చూపడానికా? నన్నేం చేయమంటావో చెప్పు. ఇది ఫోన్ అన్న సంగతీ, ఎస్.టి.డి. అన్న సంగతీ మరిచిపోయావు"

"నాకన్నీ తెలుసూ ఈ రోజు ఫోన్ బిల్ ఎన్ని రూపాయలైనా ఏం ఫరవాలేదు. అటో ఇటో తేలాల్సిందే".

"నీకేం కాదు ఆ టెలిఫోన్‌వాళ్ళొచ్చి మనింటి ముందు కూర్చుంటారే" అన్నారు ఏడుస్తున్నంతగా.

"సరే! వినండీ! ఎర్లీమార్నింగ్ నాతోపాటూ మీరూ లేవాలి. నేనెన్ని పనులు చేస్తున్నానో అన్నింటిలో మీరూ సగం పంచుకోవాలి. అలా అయితేనే నేనక్కడికి వస్తా. లేదంటే కొన్నాళ్ళిక్కడే వుంటా, నేనూ ఆఫీసుకు సెలవు పెట్టి పిల్లలకీ స్కూల్లో పర్మిషన్ తీసుకున్నా. తర్వాత మీ ఇష్టం" కరాకండీగా చెప్పేశా. "ముందా పనులేవిటో చెప్పు, ఇన్నాళ్ళనుండీ కనీసం ఒక్కపనీ చేసి ఎరగను" మాట నానుస్తున్నారు.

"మరదే ఏనాటికైనా చేయకపోతారా అనుకున్నా... కానీ మీలో ఏ మార్పూలేదు నాచే చేయించుకోవటంతప్ప. ఇహ ఇప్పుడు నే చెప్పేవన్నీ నోట్ చేసుకోండి.

"నేను వాకిలి చిమ్మితే మీరు నీళ్ళు చల్లాలి. నేనంట్లు తోమితే మీరు నీళ్లెట్టి కడగాలి. నేను బట్టలుతికితే మీరు జాడించి ఆరేయాలి.

"వాషింగ్‌మిషన్ ఉందిగా",

"దాన్లో వేస్తే పువ్వుల్లా రావడంలా" "అదేవిటీ మరి ఆ టీ.వీలో అలా మిషన్‌లోవేసి ఇలాతీస్తాడే.. మల్లెపువ్వులా అవుతుందీ షర్ట్"

"మీలాంటోళ్ళు నమ్మటంకోసం కొత్త చొక్కాని తెచ్చి అందులో అలా ముంచి ఇలా తీసి చూపిస్తారు. కానీ నేనిలాంటి అడ్వర్టైజ్‌మెంట్స్ నమ్మను. మీరు రూట్ మారుస్తున్నారు. నేచెప్పేది వినండీ. మీరూ బట్టలు జాడించి

"లేదంటే నన్ను జాడిస్తావా ఏంటీ?"

"ఇహ వంట నేను చేస్తే, మీరు కూరలు తరిగి, మసాలాలు రుబ్బాలి" "మిక్సీ ఉందిగా"

"అందులో వేస్తే టేస్ట్‌రాదు" "పిల్లలకు నేను స్నానంచేయిస్తే, మీరు బట్టలువేయాలి. చంటిదానికీ పదేళ్లనుండే జెడలు వేయలేక ఛస్తున్నా, ఈ పదేళ్ళు మీరు వేయాలి ఇక ఆ తర్వాతెలాగు దానికి పెళ్ళవుతుందీ, అప్పుడదే ఏదో తంటాలు పడుతుంది. పిల్లల్ని స్కూల్లో నేను డ్రాప్ చేస్తే వచ్చేప్పుడు మీరెళ్ళి తీసుకురావాలి. ఇవన్నీ మీరొప్పుకుంటున్నాననీ, ఒట్టెట్టుకోండీ"

"చెప్పు ఏ దేవునిపై ఒట్టెట్టుకోవాలో"

"కనిపించని దేవునిపై ఒట్టక్కర్లా, కనిపెంచుతున్న మన సంతానంపై పెట్టుకోండి. నేన్నమ్ముతా హమ్మయ్య కండీషన్లన్నీ ఒప్పుకున్నారు.

"ఒప్పుకోక ఛస్తానా, ఒప్పుకోకపోతే ఛస్తాను, అయితే రేపొద్దున్నే బయలుదేరుతావా నీకోసం చూస్తూ ఉంటా"

"అలా చూసస్తూ కూచోటంకాదు. నేనొచ్చేసరికి పిల్లలకి స్కూలు టైం, నా ఆఫీసుకీ టైం అవుతుంది, కాస్త వేడిగా అన్నం వండేసి, బాక్సుల్లో వేపుడు కూరయితేనే పట్టుకెళతారు. చంటోడు పెరుగురాయిలా వుంటేనే తింటాడు. కాబట్టి ఇప్పుడే పాలుతోడు వేసేయండీ, నాకేమో చారన్నంలేంది ముద్ద దిగదు. నేనొచ్చి పెట్టుకోవాలంటే టైం ఉండదు. అందుకనీ కాస్త చారుకూడా పెట్టేయండీ అదే చేత్తో పన్లో పనిగా మరిమీతో సమానంగా నేనూ జాబ్ చేస్తున్నానా నాతో సమానంగా మీరింటి పనిచేస్తే మనకే సుఖం"

"అదేంటీ ఆఫీసుకీ సెలవుపెట్టానన్నావ్"

"ఉత్తుత్తినే అన్నా"

"హా!!" అని నోరు తెరిచుంటారు.

★

తిండి బట్ట ఇల్లు కావాలి

డా॥ కాలువ మల్లయ్య

మూడు బజార్ల కాడ సానమందే జమయ్యింద్రు... అందరు సంబురంగానే ఉన్నరు... ముఖ్యమంత్రి ఊళ్ళెకు రాబట్టె... ఏమదుగుదామంటె ఏమదుగుదామని మాట్లాడుకుంటంద్రు... గీ ముఖ్యమంత్రి రైతుల ముఖ్యమంత్రి గద, రైతు కుటుంబంల నుంచి వచ్చినోడుగదాని అందరికి సంబురంగనే ఉంది. ఈ మద్దెన మంచి జబర్దస్త్‌గ పంచె కట్టుతున్నడు కూడా. జెనం తమ బాధలెట్ల జెప్పుకునుడని సోంచాయించుతండ్రు... అంతల్నే నువ్వద్ది రాజమల్లు వచ్చిండక్కడికి...

"ఇగో నేనిదువరకు జరిగిన సంగతులు చెప్పుత... అటెనుక మనమేమడుగుదామో నిర్ణయించుకోండ్రి... గీ సంగతులు మీకు తెలువనియ కాదు గని గిప్పుడు యాది జేసుకుంటె మంచిది..." అన్నడు...

"గా మాట నిజమేనే రాజమల్లన్న... చెప్పు..." అన్నరందరు...

ఇగ చెప్పుడు షురూ జేసిండు రాజమల్లు....

పెద్ద మంత్రిసారు రాలేదుగని గా సభకు ఓ మంత్రే వచ్చిండు... ఎమ్మెల్లే సాబచ్చిండు... ఎమ్. పి. సాబచ్చిండు. ఇగ బుడ్డ బుడ్డ లీడర్లు సానమందే వచ్చింద్రు... గిదిప్పుడు జరిగింది గాదు. గా హైటెక్కు ముఖ్యమంత్రి సారున్నప్పుడు జరిగింది. గంత మంది లీడర్లచ్చింద్రు గద... జెనం గూడ సానమందే వచ్చింద్రు... ఒగలెనుకొగలు లేసి ఉపన్యాసాలు దంచవట్టింద్రు... గాల్లు లేకముందు ఎవ్వలు బువ్వే తిననట్టు గాల్లతోనే ఇంతంత బువ్వ తింటున్నట్టు చెప్పవట్టింద్రు... కాని జెనమూకుంటరా...? మునుపటి తీరుగ నోరుమూసుకునే బాపతోల్లు కాదుగద...! తెగిన గాద్దె కొడుకులైరి. వాళ్ళు తోకా తొండెం లేకుంట మాట్లాడుతాంటె... గీల్లు నడుమ నడుమ ఏదేదో అడుగవట్టింద్రు... మేమేం జేసినా మీ కోసమే... మంచి కరెంటిత్తమని ధరలు పెంచినం... ఏదైన మంచి వస్తువు గావన్నంటె ధరెక్కుఉండదా... మేమిచ్చే కరెంటు నాణ్యమైంది కదా అని చెప్పవట్టింద్రు... సారూ... మంచి కరెంటు, సెడ్డ కరెంటుంటదని మాకు తెలువది... రోజుకున్న ఇరువయినాల్గు గంటలల్ల పది గంటలన్న కరెంటత్తె సాలు... అన్నడొగయినె... అయినా గా సార్లేడ పట్టించుకుంటరు... నాయకులు గద...

తమ చెప్పేది చెప్పుతనే ఉన్నరు... మేమేం జేసినా మీ కోసమే... ఆడోల్లకు దీపం పతకం పెట్టిచ్చినం. ఊరూకి ఫోన్లు పెట్టిత్తన్నం... కంపూటర్లిత్తన్నం... ఇంటర్‌నెట్లిత్తన్నం. పట్నాలల్ల ఫ్లైఓవర్లు కట్టిత్తన్నం... మేం హైదరాబాదులున్నా, ఊళ్ళున్న మీతో మాట్లాడచ్చు... గిట్ల ఎన్ని సేత్తున్నం మేం... అని చెప్పుకపోతనే ఉన్నరు. కానీ ప్రజలు చెప్పింది వినిపించుకుంటలేరు. ఇగ రాజశేఖరమున్నడు సూడు... మా రంకులోడు... గాడు లేసిండు.

"సారూ నన్ను కొంచెం మాట్లాడనియ్యండ్రి" అని గట్టిగా ఒర్రిండు. ఇగాల్లకు తప్పలేదు. ఇగ రాజశేఖరం గా లీడర్లకు నాభిల తలిగేటట్టు చెప్పవట్టిండు.

"సారూ...! గిట్ల ఎవ్వో మాయమాటలు చెప్పుతండ్రు మీరు... ఎవ్వలకో ఒగలకు ఓటేత్తున్నం మేం... కాని మాకేమొరిగింది లేదు... ఎన్నికలప్పుడు గ్యాస్ స్టవ్‌లిత్తిరి... మరి సిలిండర్ ధర మూడువందలు జేత్తిరి... గంత ధరపెట్టి ఎవ్వలు కొనాలె సారూ... పొయ్యిమీద కుండెట్ల ఎక్కన్నని మేం జూత్తంటె... మీరేమో పొయ్యికింది సంగతి మాట్లాడవట్టిరి...వేం మిమ్ముల వట్టిగనే బువ్వవెట్టుమంటలేం సారూ... చేతినిండ పనియ్యండ్రి... గ దానికి తగ్గట్టు పైసలియ్యండ్రి. గింత దానికి లొల్లెందుకు... మా పోరగాండ్లు సదువుకున్నా, సదువుకోకున్నా లుంగీలు కట్టుకొని వట్టిగనే తిరుగుతండ్రు... మరి గాల్లకింత పని జూపెట్టండ్రి... గిది గుర్రం గది మైదానమన్నట్టు సాదా సీదా గుండాలె కని అన్ని డొంక తిరుగుడు సంగతులెందుకు సారు...!

మాకు ఫోను గిలాసలెందుకు సారు. గా కంప్యూటర్లెందుకు సారూ...! గవ్వేమన్న కదుపు నింపేటియా? కాలు నింపేటియా? గవ్వి మీ ఆసోంటోల్లకు పట్నంల అక్కెరకత్తయేమోకని

మాకెందుకు సారూ...! గవ్వి లేకున్నా ఏం గాదుకని బక్కసక్కోల్లకు పని జూపెట్టండ్రి. నాలుగేల్లు నోట్లెకు పొయ్యే ఉపాయాలు జెప్పుండ్రి... మేమంత మీకు ఓటేసిన మనుషులంగదా సారూ...! ఇంటింటికి ముసలోల్లున్నరు. గాల్లే సారు మా అవ్వయ్యలు... తాతలు... తాతమ్మలు... గాల్లు చెంబట్టుకుని పోవన్నంటె ఊరవతలి కాలువకాడికి పోవన్నాయె. ఊరేమొ పెరిగిపాయె... గంత దూరం పోవన్నంటె ముసలోల్లకు కష్టమైతంది సారూ... గాల్ల కోసరం ఇంటికో పాయఖాన కట్టియ్యండ్రి... మాకయితె హైటెక్కుల కంటె గివ్వేనయం సారు.

గప్పట్ల మాకు ఊరవుతల్నే అయినా ఇండ్లు గట్టిచ్చింద్రు... గవ్వి కూలిపోవట్టె... నిలువనీడ లేకుండ గావట్టె... చిన్నయో చితుకయో మా కింత నీడలు గట్టియ్యండ్రి... అంతేగని... ఏమోసేత్తున్నమంటె మాకేమత్తది సారూ..." గా మాటలకు మంత్రిసారు కోపంకచ్చిండు... "మీరేం మాట్లాడ్తండ్రో తెలిసే మాట్లాడ్తుండ్రా...? మేమెన్ని జేసినా మీకయితె కృతజ్ఞతలు లెవ్వు" అన్నడు...

ఇంకో రైతందుకున్నడు...

"అవుసారు...! మాకు కృతజ్ఞతలు లేవు... మేం బే ఇమాన్‌గాల్లం... మేం మంచోల్లం కాంసారు! మేం పంటలు పండిత్తం కాని ఉపసాలుంటం. బట్టలు నేస్తం కని మా పెయిలమీద బట్టలుండయి... చెప్పులు జేత్తం కని మా కాల్లకు సెప్పులుండయి... మేం అరొక్క తీరు పనిజేసినా మా కోసురం గాదు... మేమెన్ని జేసినా మా కడుపులు నిండయి... గిట్లెందు కైతందని అడుగుతె బే ఇమాన్‌గాల్లం. మా పెయిలమీద బరిబద్ద బొక్కలే ఎందుకుంటున్నయి సారూ...! వేం బే-ఇమాన్‌గాల్లమూ...!" అన్నడు.

గట్లనే తాపకొగలు మాట్లాడింద్రు.

గిదంతెట్లనో ఉందని గా మీటింగును జెప్పున ఖతం జేసి ఎల్లిపెయింద్రు నాయకులు. గట్లయింది గా సభ..." అన్నడు రాజమల్లు...

"ఏందే రాజమల్లన్న...! ఏలేటోల్లంత మన కోసరమే సేత్తున్న మనవట్రి... కని ఎక్కడేసిన గొంగడక్కడన్నట్టే ఉండె... మరి మనం గీ కొత్త పెద్ద సారుతోనేం మాట్లాడదాం? చెప్పింది వినత్తమా..." అన్నడు లచ్చుమయ్య.

"నిజం చెప్పుమంటవా...? అపద్దమా...?" అన్నడు రాజమల్లు...

"నువ్వేమన్న రాజకీయ నాయకునివా అవద్దం చెప్పటానికి..." ఇగ అగ్గసోంటి నిజాలు చెప్పవట్టిండు రాజమల్లు...

"మనోల్లు గప్పుడు గా నాయకులను నిలదీసి అవ్వల్లర్ల గడిగింద్రు... అయినా వాళ్ళు పట్టించుకోలేదు. ప్రజల మాటలను, అవుసరాలను పట్టించుకోక హైటెక్కు హైటెక్కు అంటేమయింది... ప్రజలోడించాద్రా లేదా? గీ సారుగూడ గట్లనే సేసిండనుకో. గంతే అయితది. నిజంగ మనిషికి కావల్సిన యేంటి...? మనోల్లు ఆనాడు అడిగిన దాంట్లనే జవాబులున్నయి. కదుపునింద బువ్వ... ఉండటానికిల్లు... కట్టుకుంటానికి బట్ట... గివ్వయినంకనేకద ఇంకెవ్వయినా... గివ్విట్ని పట్టించుకోకుంటె గిట్లనే అయితది ఏ దేశంలనయిన గీ కనీసవసరాల్ని తీర్చు గవిరిమెంటులే మంచివి. అటెనుక సదువు... సుబ్రాలు... హక్కులనుకో. అంటే రోటీ కప్‌డా ఔర్ మకాన్ ఇచ్చుడు ప్రభుత్వ బాధ్యత... గా సంగతే అడుగుదాం పాండ్రి గీ సారును కూడా..."

"బాగ జెప్పినవే... పోదాం పా... అగో మంత్రులు, సార్లు వత్తున్నట్టున్నరు... కార్లు వస్తూ పోతున్నయ్. పోదాం పాండ్రి..."

అందరు కట్టగట్టుకొని గా సభకాడికురుకవట్టింద్రు...

"ప్రజలకేం చెయ్యనోల్లను ఓడిత్తనే సరిపోతదా..." అన్నడు నర్సింహులు.

"గీ సంగతలోసించదగ్గదే..." అన్నడు రాజమల్లు. ★

హిస్టీరియా

డా॥ ఉమా జ్యోతి

హిస్టీరియా అనేది ఓ మానసిక రుగ్మత. దీని గురించి కొన్ని వందల సంవత్సరాల క్రితమే వైద్య గ్రంథాల్లో వివరించబడింది. చాలా మంది దెయ్యం పట్టింది అని లేకపోతే పూనకం వచ్చిందని అంటుంటారు. దానినే మెడికల్ పరిభాషలో హిస్టీరియా అంటాము. కానీ ప్రస్తుతం ఇది జనంలో ఉన్న మాటే కాని మెడికల్ పుస్తకాల్లో కన్వర్జన్ డిసార్డర్ లేక డిసోసియేషన్ డిజార్డర్ అంటారు.

లక్షణాలు: ఇది ఉన్నట్టుండి అకస్మాత్తుగా వస్తుంది. మనిషి తన శరీరం, మాటలు, చేతలు తన స్వాధీనంలో లేక ఎవరి చేతనో కంట్రోల్ చేయబడుతున్నట్లు, నాటకీయ ప్రవర్తన, తన స్థాయి లేక పరిసరాలు లేక వయస్సు మరచి ప్రవర్తించడం జరుగుతుంది. ఒక్కోసారి వీరి స్వరం కూడా మారిపోతుంది. అందరిలో జబ్బు లక్షణాలు ఒకే విధంగా ఉండవు. కొందరిలో ఉన్నట్టుండి మాట పడిపోవడం, కళ్లు కనిపించకపోవడం, కాళ్ళు చేతులు పడిపోయి చలనం లేకుండా ఉండడం కూడా జరుగుతుంది. కొందరిలో రోజురోజుకీ లక్షణాలు మారుతూ ఉంటాయి. కొన్నిసార్లు మూర్ఛలు వచ్చినట్లు కొట్టుకుంటారు లేదా పూనకం వచ్చినట్లు ఏదో మాట్లాడుతూ ఊగుతుంటారు. ఈ జబ్బు లక్షణాల గురించి అధర్వణ వేదంలో రాక్షస ప్రాహ అని,గ్రాహి అని వివరించారు.

హిస్టీరియా ఎక్కువగా ఆడవారిలో కనబడుతుంది. పిల్లల్లో కూడా ఐదు సంవత్సరాలు పైబడిన వారిలో ఈ లక్షణాలు గమనించవచ్చు. భారతదేశంలో జరిగిన అధ్యయనాల్లో ఇది ఎక్కువగా పెళ్ళయిన ఆడవారిలో అందులోనూ చదువులేని వారిలో కనబడుతుంది. హిస్టీరియా యుద్ధం జరిగే రోజుల్లో కొందరు సైనికులలో కూడా గమనించారు.

కారణాలు: కొన్ని వందల సంవత్సరాల క్రితం హిస్టీరియా ఆడవారిలోనే ఎక్కువగా వస్తుంది కాబట్టి గర్భసంచిలో మార్పులు రావటం వలన అనుకునేవారు. కాని అది నిజం కాదని తరువాత నిరూపించబడింది.

దీనికి మొదటి కారణం పేషెంట్‌లో అంతర్లీనంగా తీరని కోరికలుగాని, ఘర్షణకానీ, ఎవరికీ చెప్పుకోలేని సమస్యలుగానీ ఉన్నప్పుడు అది బాహ్యరూపంలో శారీరక రుగ్మతగా బయటపడుతుంది. పేషెంట్‌కు ఏదైనా సమస్య ఉన్నప్పుడు వస్తుంది కాబట్టి వారు కావాలని చేస్తున్నారు అని అనుకోగూడదు. ఎందుకంటే వారి మానసిక స్థితి వారి కంట్రోల్‌లో ఉండదు కాబట్టి. ఇది ఒక రకమైన మానసిక రక్షణ వ్యవస్థ. ఉదాహరణకు మన శరీరానికి రక్షణ కల్పించడానికి కరాటే, కుంగ్‌ఫూ మొదలగు యుద్ధ విద్యలు ఎలా ఉంటాయో మానసికంగా జరిగే యుద్ధంలో తప్పించుకోవడానికి లేదా ఎదుర్కోవడానికి కొన్ని పద్ధతులు ఉంటాయి. వాటినే ఇంగ్లీషులో డిఫెన్స్ మెకానిజమ్స్ అంటారు. ఫాల్స్ డిఫెన్స్ మెకానిజమ్స్ ఉపయోగించినప్పుడు హిస్టీరియా వస్తుంది.

ఉదాహరణకు రెండు కేసుల గురించి చూద్దాం. ఒక మంచి పొజిషన్‌లో ఉన్న భర్త ఉదయం నుంచి రాత్రి వరకు వ్యాపారంలో తలమునకలై ఉంటాడు. భార్యను పట్టించుకునే తీరిక ఉండదు. ఎక్కడికన్నా తీసుకువెళ్ళమన్నా వీలుపడదు అంటాడు. ఆ పరిస్థితుల్లో భార్యకు ఉన్నట్టుండి మాటపడిపోతుంది. భర్త కంగారుపడి ఆఫీసు పనులు మానేసి భార్యను తీసుకుని ఆసుపత్రుల చుట్టూ తిరుగుతాడు. భార్యకు భర్త తన దగ్గరే ఉన్న ఆనందంతో జబ్బు తగ్గిపోతుంది.

రెండవ కేసులో ఒక అమ్మాయి కాలేజీలో చదువుకుంటున్నది. తల్లిదండ్రుల బలవంతం మీద తనకిష్టంలేని గ్రూపు చదవవలసివస్తుంది.

ఉన్నట్టుండి ఆ అమ్మాయి మూర్ఛలతో కొట్టుకోవడంగానీ లేదా ఊపిరి ఆడడంలేదు గుండెనొప్పిగా ఉందని లేవకపోవడం గానీ జరుగుతుంది. దాంతో ఇంట్లో వాళ్ళు కాలేజీకి పంపడం మానేస్తారు.

ఈ రెండు కేసుల్లో పేషెంట్‌కు కుటుంబంలో సమస్య ఉంది. అది మాట్లాడిపరిష్కరించే సామర్థ్యం లేకపోవడం వలన వారి మనస్సు మీద తీవ్రమైన ఒత్తిడి కలుగుతుంది. అప్పుడు ఆ ఒత్తిడి తగ్గించడానికి వారి మనస్సు ఒక డిఫెన్స్ మెకానిజమ్‌ను ఎన్నుకుంటుంది. అదే హిస్టీరియా లేక డిసోసియేషన్.

మన సమాజంలో శారీరక జబ్బులకు సానుభూతి చూపిస్తారు. కానీ మానసిక జబ్బులకు హేళన చేస్తారు, అవమానిస్తారు. ఉదా:- ఇంతకు ముందు చెప్పిన మొదటి కేసులో భార్య భర్తను తనతో కాసేపు గడపమని చెప్పినా, ఆలోచనలతో తనకు ఆందోళనగా, బాధగా ఉందని చెప్పినా మనవాళ్ళు మొదట అనేదేమిటంటే తిన్నది అరగలేదా, పిచ్చిపిచ్చి ఆలోచనలు చేస్తున్నావు చక్కగా మొగుడు సంపాదిస్తుంటే సంతోషించక ఈ గోలేంటి అంటారు. తన ఆలోచనలకు కొంచెం కూడా విలువ ఇవ్వరు. అదే భార్యకు ఉన్నట్టుండి మాటపడిపోయింది అనుకోండి ఏడుస్తూ ఆమె దగ్గరే ఉంటారు. ఆమెను డాక్టర్లకు చూపిస్తారు. ప్రేమతో చూసుకుంటారు. ఎవ్వరూ ఆమెను తప్పుపట్టరు. హేళన చేయరు.

కాబట్టి మానసికంగా ఏదైనా తీరని కోరిక ఉన్నప్పుడుగానీ, జీవితంలో ఏదైనా సమస్య ఎదురైనప్పుడు గానీ, తన వారితో గొడవలు వచ్చినప్పుడు గానీ అవి మానసికంగా కలుగచేసే బాధ నుంచి తప్పించుకోవడానికి మనస్సు ఎన్నో ప్రయత్నాలు చేస్తుంది. అందులో హిస్టీరియా ఒకటి.

ఇక్కడ అందరూ గుర్తుపెట్టుకోవలసిన విషయం హిస్టీరియా వచ్చిన సమయంలో రోగులు తన మనస్సు, చేతలపై కొద్దిసేపు కంట్రోల్ పోగొట్టుకుంటారు. కావున వారు సమస్య నుంచి తప్పించుకోవడానికి కావాలని నాటకం ఆడుతున్నారని అనకూడదు. వారిని సానుభూతితో అర్థం చేసుకుని వారి సమస్య కనుక్కొని అది పరిష్కరించడానికి ప్రయత్నం చేయాలి. వారిని తిట్టడంవలన కానీ, హేళన చేయడం వలన కానీ ఆ జబ్బు ఇంకా ఎక్కువవుతుంది.

ట్రీట్‌మెంట్: వైద్యం విషయానికి వస్తే వీరిని మొదట హాస్పిటల్‌లో వుంచాలి. శారీరకంగా ఏ రకమైన సమస్యలు లేవని నిర్ధారణ కోసం అవసరమైన పరీక్షలు చేయాలి. ఎందుకంటే కొన్ని శారీరక జబ్బులు అకస్మాత్తుగా ఒకే లక్షణంతో బయటపడతాయి. ఉదాహరణకు మెదడులో రక్తం గడ్డకట్టినప్పుడు లేదా రక్త సరఫరాలో ఏదైనా అవాంతరం వచ్చినప్పుడు పక్షవాతం వస్తుందని అందరికీ తెలిసిన విషయమే. కానీ ఒక్కోసారి కేవలం మాట పడిపోవడం లేదా చూపు తగ్గడం అదీ కొద్దిసేపు మాత్రమే జరుగుతుంది. మెదడుకు సంబంధించిన కొన్ని జబ్బులలో మొదట లక్షణాలు చాలా నాటకీయంగా మొదలవుతాయి. ఉదాహరణకు ఉన్నట్టుండి ఏదేదో మాట్లాడటం లేదా అరవడం లేదా ఎవరినీ గుర్తించకపోవడం వగైరా. కాబట్టి హిస్టీరియా పేషెంట్‌ను అన్ని రకాలుగా పరీక్షించి ఏవిధమైన శారీరక జబ్బులు లేవని నిర్ధారించుకోవాలి. తరువాత పేషెంట్‌ను వారి కుటుంబ సభ్యులను విడివిడిగా ఇంటర్వ్యూ చేసి కుటుంబంలో ఏమైనా సమస్యలున్నాయేమోనని తెలుసుకోవాలి. పేషెంట్ జబ్బు రాకముందు ప్రవర్తన, వ్యక్తిత్వం, అలవాట్లు, సమస్య పరిష్కరించే విధానం అన్నీ తెలుసుకోవాలి.

హిస్టీరియా ట్రీట్‌మెంట్‌లో వివిధ పద్ధతులు ఉన్నాయి. ఉదాహరణకు ఫిజియోథెరపీ, బిహేవియర్ థెరపీ, అబ్రియాక్షన్, సైకో ఎనాలసిస్, మందులు వగైరా.

ముఖ్యంగా రోగి మానసిక స్థితిపై కాన్‌సన్‌ట్రేట్ చేయాలి. హిప్నోసిస్ కూడా హిస్టీరియాలో బాగా పనిచేస్తుంది. పేషెంట్‌కు ప్రాబ్లమ్ సాల్వింగ్ టెక్నిక్స్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్ టెక్నిక్స్ నేర్పించాలి. అంటే సమస్య పరిష్కరించుకునే విధానాలు, ఒత్తిడి తట్టుకునే మార్గాలు అన్నమాట. ఎందుకంటే ఇప్పుడున్న సమస్యను పరిష్కరించి వదిలేశామనుకోండి భవిష్యత్తులో సమస్యకు మళ్ళీ హిస్టీరియా రావచ్చు. ఉదాహరణకు మొదటి కేసులో భర్తను ఆమెతో ఎక్కువ సేపు గడపమని చెప్పి పంపించేశామనుకోండి తరువాత పిల్లలు మాట వినకపోయినా ఆమెకు హిస్టీరియా రావచ్చు. కాబట్టి సమస్యను పరిష్కరించుకోవటానికి ఆమె మనస్సు ఎన్నుకొన్న విధానం సరైంది కాదు అని మనం తెలియచెప్పాలి.

ఒక కేసులో ఒక అమ్మాయి మొదటి వివాహంలో తేడాలు వచ్చి భర్త నుంచి విడిపోయింది. తల్లి దగ్గర వుంటోంది. పొలం పని చేసుకొని బ్రతుకుతోంది. కానీ తల్లి చాదస్తం వలన భర్తను విడిచి రావటం ఆమెదే తప్పని రోజూ పేషెంట్ దగ్గర నసపెట్టటం మొదలుపెట్టింది. అది తట్టుకోలేని పేషెంట్‌కు ఉన్నట్టుండి కాలు, చెయ్యి పడిపోయాయి. పక్షవాతం అనుకుని అన్ని పరీక్షలు చేసి చూశారు. ఏమీ తేడా లేదు. అప్పుడు తల్లీకూతుళ్ళకు కౌన్సిలింగ్ చేసి పంపించాం. పేషెంట్ చక్కగా నడుచుకుంటూ వెళ్ళింది.

కొన్ని పరిస్థితుల్లో అవసరమైతే ఆందోళన తగ్గించడానికి, నిద్రపోవడానికి కొన్ని మందులు వాడవలసి వస్తుంది. ఫ్యామిలీ థెరపీ, మారిటల్ థెరపీ వంటివి కూడా కొన్ని కేసుల్లో చేయవలసి వస్తుంది.

నివారణ: ఈ కేసుల్ని ఎక్కువగా భూతవైద్యుల చుట్టూ తిప్పడం లేదా తాయెత్తులు కట్టించడం చేసి వైద్యులకు చూపకుండా ఆలస్యం చేస్తారు. దీనివల్ల జబ్బు తీవ్రత పెరగడం లేదా వేరే మానసిక వ్యాధులు కూడా మొదలవడం జరుగుతుంది. కాబట్టి ముందుగా వైద్యులనే సంప్రదించాలి.

ఈ జబ్బు మళ్ళీ రాకుండా ఉండాలంటే మన చేతుల్లో ఉన్న కొన్ని విషయాలు చెప్తాను. మొదటిది స్త్రీకి విద్య, ఉపాధి, ఆర్థిక స్వేచ్ఛ అవసరం. చదువుకున్న వారు తమ సమస్యలను చక్కగా వ్యక్తీకరించగలుగుతారు. ఎటువంటి సమస్యకు ఎవరి దగ్గరకు వెళ్ళాలి గుర్తించగలుగుతారు. స్త్రీల మనోభావాలను భర్త, ఇతర కుటుంబ సభ్యులు గౌరవించాలి. వారి కోరిక తీర్చలేనిదయితే నెమ్మదిగా చెప్పాలి. ముఖ్యంగా సున్నితమైన వ్యక్తిత్వం గల స్త్రీలలో ఇది తప్పనిసరి.

చిన్నపిల్లల్లో, టీనేజి వయస్సుల్లో కూడా ఈ సమస్య ఉంటుంది. తరచుగా స్కూల్ లేదా కాలేజ్ తప్పించుకోవడానికి ఏదో ఒక శారీరక సమస్య చూపుతుంటారు. వారి భయానికి గల కారణం కనుక్కుని ఆ భయాన్ని, ఆందోళనను దూరం చేయాలి. అంతేకానీ వారిని కొట్టి, తిట్టి పంపించకూడదు. అలా చేయడం వలన తీవ్రమైన వ్యాధులు కలుగుతాయి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందరూ పిల్లల్ని అర్థం చేసుకుని వారి భయాన్ని రూపుమాపాలి.

కొన్ని అధ్యయనాల ప్రకారం స్త్రీలలో విద్యా ప్రమాణాలు పెంచడం వలన, మానసిక సమస్యలపై అవగాహన పెంచడం వలన హిస్టీరియాను చాలా వరకు తగ్గించవచ్చును. దీని కొరకు మనమందరం కృషి చేయాలి. ★

బ్యాంక్ బాబు
వెల: రూ. 50/-
ప్రతులకు:
ప్రజాశక్తి,
విశాలాంధ్ర, దిశ
బుక్‌హౌస్‌లు

'శేఖర్టూన్లు'

శేఖర్టూన్స్
వెల: రూ. 50/-
ప్రతులకు:
ప్రజాశక్తి,
విశాలాంధ్ర, దిశ
బుక్‌హౌస్‌లు

రెండుగంటల ప్రసంగాన్ని అయినా, రెండు పేజీల వ్యాసాన్నయినా ఒక కార్టూన్‌లో చూపొచ్చు. ఒక కార్టూన్ వెనక ఎంతో అర్థం, ఆలోచన దాగి ఉంటుంది. ఒక్కొకసారి అది పాలకులను నిలదీస్తుంది, వారి వారి స్థానాలనే తారుమారు చేస్తుంది. అలా చేసిన కార్టూనిస్టులు ఎంతోమంది వున్నారు. అలాంటి వారిలో తెలుగు కార్టూనిస్టులు కూడా వున్నారు. తెలుగువారు గర్వించదగ్గ కార్టూనిస్టుల్లో శేఖర్ ఒకరని చెప్పవచ్చు. ఆయన కార్టూనిస్ట్ జీవితం 'ప్రజాశక్తి' లోనే మొదలైంది. శేఖర్ తన కార్టూన్స్ అన్ని నవ్వించకున్నా, ఆలోచింపచేస్తే చాలు అనుకుంటారు. "బ్యాంక్ బాబు", "శేఖర్టూన్స్" లలో నూటికి నూరుపాళ్ళు ఆయన సక్సెస్ అయ్యారు. సంస్కరణలు ప్రజలకు మేలు చేయాలి కాని కీడు చేయరాదు. ప్రపంచంలో ఎన్నో ప్రభుత్వాలను మనం చూశాం. సంస్కరణల పేరుతో అమెరికాకు, ప్రపంచబ్యాంకుకు ఊడిగంచేస్తే ప్రజలు సహించరని, ప్రతిఘటిస్తారని ఆచరణలో రుజువయ్యింది. ఈ కార్టూన్స్‌లో అదే వ్యక్త మవుతుంది. సంస్కరణల వల్ల ప్రజల ఆర్థిక, సామాజిక స్థితి మారాలి కానీ ఇంకా దీనస్థితికి దిగజారకూడదు. చందబాబు ప్రజలకంటే ప్రపంచబ్యాంకునే ఎక్కువగా ప్రేమించాడు. వారు చెప్పిందే చేశాడు. బైటపడలేనంత అప్పుల ఊబిలోకి, దీన స్థితికి రాష్ట్రాన్ని తీసుకెళ్ళాడు. అన్ని ఇజాలకు కాలం చెల్లిందని మిగిలింది టూరిజమేనని ఎన్నోరోజులు చెబుతూ వచ్చారు. ప్రజలకు కావల్సింది కాలే కడుపుకు ఇంత అన్నం కానీ కంప్యూటర్స్ కాదని, అభివృద్ధి అంటే పై ఓవర్లు, తారురోడ్లు, హైటెక్ సిటీ, కారురేసులు కాదని తెలుసుకోవడం కోసం చంద్రబాబుగారికి చాలా రోజులే పట్టింది.

బాబుగారు తెచ్చిన అప్పులను "రైతుల ఘోరీలు కట్టించడం కోసం ఉపయోగించాం" అనే కార్టూన్ ఎంతగానో ఆలోచింపచేస్తుంది. చంద్రబాబు తొమ్మిదేళ్ల పాలనలో వేల కొలది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. నా చావుకు కారణం చంద్రబాబే అని రాసి మరీ చనిపోయారు. ఎంతోమంది కార్మికులు ఉద్యోగాలను కోల్పోయారు. ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటుకు అప్పచెప్పడం బాబు చేసినా, బ్యాంకు వాళ్లే చేయించారనేది స్పష్టం. పైకి పోవాలంటే ఇంకొన్ని ప్రభుత్వ సంస్థలను తగ్గించుకో అని ప్రపంచ బ్యాంకు ఆదేశించే కార్టూన్ చాలా బాగుంది. ఆకలితో అలమటించి చాలామంది తనువు చాలించారు. మిగిలిన కొంతమంది ఊళ్లే ఖాళీ చేసి వలసలు పోయారు. 'నారాజంగ్ మ్యూజియం' అనే కార్టూన్ చూస్తే హృదయం ద్రవిస్తుంది. 'నేను కేవలం నటిస్తున్నానంటే ఒప్పుకోను....నటనలో జీవిస్తున్నా' అనే కార్టూన్ ఓ మంచి వ్యంగ్య బాణం. "విత్ అవుట్ క్యాప్షన్" కార్టూన్స్ ఆలోచింపజేస్తాయి. కృత్రిమ వర్షాలు కార్టూన్ చాలా బాగుంది. మనిద్దరి మధ్యా భేదాల్లేవని ప్రెస్ వాళ్లకి నేను చెబుతానంటే నేను చెబుతాననే కార్టూన్ నవ్విస్తూనే చురుక్కుమనిపిస్తుంది. ఒకే వ్యక్తి పై గీసిన కార్టూన్స్ బుక్ రూపంలో తెచ్చిన కార్టూనిస్టులు జాతీయంగా, అంతర్జాతీయంగా చాలామంది ఉన్నా, తెలుగులో శేఖర్ మొదటివాడు అని చెప్పొచ్చు. శేఖర్టూన్స్‌లో నిరుద్యోగం, అవినీతి, నీటికొరత, రాజకీయం, కరువు, నక్సల్స్,పోలీసులు, ఇలా చాలా అంశాలమీద కార్టూన్స్ వున్నా ఇంకా కొన్ని ఉంటే బాగుండేది. శేఖర్ తనదైన శైలిలో ఇకముందు కూడా ఆయన కుంచె నుంచి ఎన్నో కార్టూన్లు జాలువారి, సమాజాభివృద్ధికి, చైతన్యానికి ఉపయోగపడాలని కోరుకుంటున్నవాళ్లలో నేనూ ఒకణ్ణి.

జె.వెంకటేష్



ఎందుకింత ఆగ్రహం!, మానవహక్కుల వేదిక ప్రచురణ: పేజీలు:44, వెల: రూ. 5/-, ప్రతులకు: ప్రజాశక్తి, నవోదయా, దిశ పుస్తక కేంద్రాలు. మరియు జీవన్ కుమార్, 3-12-117/ఏ-2/1, పి ఎన్ కాలనీ, రామాంతపూర్, హైదరాబాద్-13

మణిపూర్ ఆగ్రహం

మణిపూర్ అనగానే ఒక్కసారిగా ఇటీవల అక్కడ పెల్లుబికిన మహిళాగ్రహం గుర్తుకు వస్తుంది. ఏ స్త్రీ అయినా తన మానప్రాణాలకు, అభిమానాలకు ఎంతో విలువిస్తుంది. అలాంటిది ఆ మణిపూర్ స్త్రీలు "రండిరా సైనికులని పేరుపెట్టుకున్న మృగాల్లారా...మమ్మల్ని చెరచండి" అని తమ నగ్న దేహాల్నే ఆయుధంగా ఎందుకు మార్చుకున్నారు? అస్సాం రైఫుల్స్ వారి కార్యాలయం ముందు అలా ఎందుకు ఛాలెంజ్ చేశారు అనే ప్రశ్న మనల్ని వెన్నాడుతుంది. మానవ హక్కుల వేదిక వారు చాలా సుదీర్ఘ ప్రయాణం చేసి మణిపూర్ పర్యటించి, విలువైన వాస్తవ సేకరణ చేసి 44 పేజీల పుస్తకాన్ని ప్రచురించారు. గత ఏడాది జులై11న అస్సాం రైఫుల్స్‌కు చెందినవారు తంగ్‌జామ్ మనోరమపై అత్యాచారం చేసి చంపివేశారు. ఆ సంఘటన మణిపూరీ వాసుల్లో నివురుగప్పిన కోపాగ్ని ఒక్కపెట్టున లావాలా ఉప్పొంగేలా చేసింది. అంతటి ఆగ్రహావేశాలకు కారణమయిన సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టం పూర్వాపరాలు ఈ పుస్తకంలో వివరించారు. మణిపూర్‌లోని నాగాజాతి జనుల హక్కుల గురించి, జూన్ 1947లో జరిగిన హైదరీ-ఎన్ఎన్‌సి ఒప్పందం వివరాలు, సైనికులు తమకున్న అసాధారణ అధికారాలతో మదమెక్కి చేసిన దారుణాలు ఇందులో పొందుపరిచారు. నిజనిర్ధారణ కమిటీ మీరాపైబీ మహిళలతో సేకరించిన వివరాలు, చిత్తరంజన్ అనే యువకుడి ఆత్మాహుతి నిరసన వెనుక మంచిచెడ్డల్ని, మణిపూర్ చారిత్రక అంశాలు ఇలా చాలా చిన్నపుస్తకంలో ఎంతో గాఢమైన విషయాలను పొందుపరిచారు.

-ఉదయ శంకర్

స్వీకారం



తెలుగు సాహిత్య చరిత్ర
కె.ఆర్.కె. మోహన్
వెల: రూ. 40/-
ప్రతులకు:
విశాలాంధ్ర
అన్ని బ్రాంచీలు



లోలోకి..
ఈగ హనుమాన్
వెల: రూ. 30/-
ప్రతులకు:
ప్రజాశక్తి,
నవోదయ, దిశ,
విశాలాంధ్ర
అన్ని బ్రాంచీలు

పెరటి చెట్టు
జి. రాములు కథలు
వెల: రూ. 50/-
ప్రతులకు:
అన్ని ప్రముఖ బుక్‌స్టాల్స్‌లో

ఓరుగల్లుకోటలో శిల్పకళా తోరణాలు

కాకతీయుల కళా వైభవానికి నిలువుటద్దం ఓరుగల్లు కోట. మన రాష్ట్రంలోనే పేరెన్నికగన్న పర్యాటకరంగంలో అద్వితీయమూ. అపూర్వము అయినది ఓరుగల్లుకోట.

శిల్పకళా తోరణం

యాసలపు సూర్యారావు

నాటి ఓరుగల్లే నేటి వరంగల్. ఇక్కడకు అను నిత్యం పర్యాటకులు దేశం నలుమూలల నుంచేగాక విదేశాల నుండి కూడా వచ్చి ఇక్కడి ప్రాచీన కళా వైభవాలను కనులారా తిలకించి పరవశించి పోతారు. ఇక్కడ నాడు కాకతీయ రాజులు నిర్మించిన ఓరుగల్లు దుర్గం శత్రుదుర్భేద్యమయినదని ప్రతీతి. సుమారు 75 కిలో మీటర్లు విస్తీర్ణం చుట్టూ వ్యాపించివున్న ఈ దుర్గం చుట్టూ మట్టితో కోటరక్షణ ప్రాకారాలు నిర్మించినారు. కాకతీయ గణవతి దేవమహారాజు తన రాజధానిని హనుమకొండ నుండి ఓరుగల్లుకు మార్చు కున్నారు. కోట చుట్టూతా 75 బురుజులు వుండేవి. ఒక్కొక్క బురుజు రక్షణ నిమిత్తం. ఒక్కొక్క నాయకునికి దీని రక్షణ బాధ్యతను అప్పగించారు. కోట లోపలి దుర్గాన్ని రాణీరుద్రమ్మదేవి నిర్మించింది అని చరిత్ర చెబుతుంది. నేటికి అక్కడ కోటలో ప్రజా జీవనం కొనసాగుతోంది. నాటి శిధిల దేవాల యాలు దర్శనం ఇస్తున్నాయి. అక్కడ నాడు నిర్మించిన షితాబ్‌ఖాన్‌మహలు ఇప్పటికి చెక్కు చెదరకుండా నాటి అపూర్వ రాతి కట్టడాలు గొప్ప దనంతో చూపరు లను ఆకర్షిస్తున్నాయి. అక్కడ అత్యంత ప్రాధాన్యత గలిగిన శిల్పకళా తోరణాలు ఇప్పటకి చెక్కు చెదరక నాటి శిల్పుల కళానైపుణ్యతలను ఎలుగెత్తి చాటుతున్నాయి. కాకతీయుల నిర్మాణాలు అన్నింటిలోనూ స్వయంభూదేవుని ఆలయ ప్రాంగాణమునకు నాలుగు దిక్కులా గల హంస తోరణములు మిక్కిలి పెద్దవి. సాంచియందు గల బౌద్ధ స్తూప తోరణాలవలే ఈ హంస తోరణాలు ఓరుగల్లుకు ప్రపంచ ప్రఖ్యాతిని ఆర్జించిపెట్టాయి. వీటితోపాటుగా రామలింగేశ్వర, వెంకటేశ్వర దేవాలయాలున్నాయి.. పర్యాటకులు. ఓరుగల్లు మట్టి కోటలోకి ప్రవేశించగానే ఒక ప్రాచీన రాతికట్టడపు కోటలోకి ప్రవేశిస్తున్నాయిన్న అనుభూతికి గురౌతారు. అలా కొంతదూరం వెళ్లాక అక్కడ కాకతీయుల శిల్పకళా వైభవానికి దర్పణంగా నాలుగు దిక్కులా అతిపెద్ద శిల్పకళా తోరణాల మధ్య ఏకశిలా సదృశ్యమయిన అనేక శిల్పాల సముదాయం మనల్ని మంత్రముగ్ధుల్ని చేస్తుంది. అక్కడగల అనేక శిల్పాలు ధ్వంసం అవ్వడం కారణంగా అవయవాలు విరిగి వున్నాయి. మరో ప్రక్క అతిపెద్ద ఏకశిలా కొండ. ఆ కొండపై అనేక రాతికట్టడాలు చూడగలం. అంతే కాదు. ఓరుగల్లు చుట్టూగల మట్టిగోడతో దర్శించిన ప్రాకారం కూడా చూడగలుగుతాము. ఆ కొండపై ఒక దేవాలయాన్ని కూడా రాతి కట్టడంతో నిర్మించారు. ఆ కొండపైనుండి చూస్తే ఓరుగల్లు నగరం అత్యంత సుందరంగా కనిపించి కనువిందు చేస్తుంది. రాతికొండకు అనుకుని ఒక నిండైన చెరువు కూడా వుంది. అక్కడే పర్యాటకశాఖవారు అందమయిన పార్కును కూడా నిర్మించారు. అక్కడకు నిత్యం పిల్లలు పెద్దలు వందలాది మంది వస్తుంటారు. అయితే పర్యాటక శాఖవారి నిర్లక్ష్యానికి గుర్తుగా ఇక్కడి అపూర్వ శిల్ప కళాసంపద ఆరుబయట ఎండలో కళా సౌందర్యాన్నీ కోల్పోతూ వున్నాయి. వాటికి సరయిన రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై వుంది.

వరంగల్‌కు చేరడానికి అటు హైదరాబాద్ నుండి ఇటు విజయవాడ నుండి రైళ్ళు, బస్సుల సౌకర్యం విరివిగా ఉన్నాయి. ☆



ఓరుగల్లు కోటలో శిల్పకళా సంపద

ప్రొసీనియం రంగస్థలాన ప్రజానాట్యమండలి

శంకర్, ఆర్వీ రమణ

తొలినాళ్ళలో ప్రజానాట్యమండలి నాటకరంగాన్ని ప్రజలపక్షం చేసిన చరిత్ర ఎప్పటికీ ఉత్తేజకరమైనదే. ఒక దిశా దశా అనదగ్గ కళారంగ కృషి నాడు జరిగింది. ఒక్క 'మా భూమి' నాటకం గురించి గుర్తొస్తే చాలు... నాటి ప్రజాసాంస్కృతికోద్యమ కృషంతా మన కళ్ళముందుంటుంది.

సాహితీ సాంస్కృతికోద్యమ అవసరాలు నాటకాన్ని రంగస్థలంమీద నుంచి కటికనేలపైకి దింపింది. అంతేకాదు...ప్రజల ఇళ్ల ముంగిళ్ళకు, బజార్లకు, నాలుగురోడ్ల కూడళ్ళకు, ఫ్యాక్టరీ గేట్లకు నడుచుకుంటూ వెళ్ళింది. ఇది ఎవరూ కాదనలేని, మరువలేని, అనివార్య పరిణామం. అదే సమయంలో ప్రొసీనియమ్ నాటకరంగం పట్ల ఒక విధమైన నిర్లక్ష్యం జరిగిందా అనిపిస్తుంది. ఆ రంగాన ప్రజాకళారంగం లేకపోవటం వృత్తి, వ్యాపార, పరిషత్‌లకే వదిలివేసినట్లయ్యింది. బహుశా ఈ ఆలోచనతోనేమో ప్రజానాట్యమండలి ఈసారి తన 7వ రాష్ట్ర మహాసభలను ప్రొసీనియం నాటకరంగం మీద కాలిడింది. అంతమాత్రాన ఈ రంగం ప్రజాకళారంగానికేం కొత్త అని కాదు. కొన్ని దశాబ్దాల తరువాత మళ్ళీ పునఃప్రవేశం అనుకోవచ్చు. ఫిబ్రవరి 21 నుంచి 25వ తేదీ వరకూ హైదరాబాద్, రవీంద్రభారతిలో రంగస్థల ప్రదర్శనలిచ్చింది.

రంగస్థల ప్రదర్శనల్లో పరిషత్ నాటక పోటీలకు ధీటుగా ప్రదర్శించగలదని ప్రజానాట్యమండలి నిరూపించే ప్రయత్నం చేసింది. ఈ రంగస్థల నాటకప్రదర్శనలను ఆనాటి ప్రజానాట్యమండలి యోధుడు వల్లం నరసింహారావు ప్రారంభించారు. మొదటి రోజున గుంటూరుజిల్లా పల్నాడు వీరయోధుడు కన్నెగంటి హనుమంతు వీరగాథ "వీరగంథం" ప్రదర్శించారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు దేవి రచించిన ఆ నాటకాన్ని గుంటూరుజిల్లా మించాలపాడు గ్రామస్తులే నటించారు. వీరగంథం

వీరగంథం నాటకంలో దృశ్యం

జలం... నా ప్రాణం

మార్చి 21, ప్రపంచ జలదినోత్సవం

జలమా...
నా ప్రాణమా...
ఊటనీళ్ళ చెలమా
దాహాగ్ని పాలిట ఫైరింజనమా

హెచ్‌టూ ఓ అయి
జీవకోటి ప్రసవానికి మంత్రసానివై .....
కాళ్ళుకడిగి పీఠమేసి
విశ్వాన్ని పట్టాభిషిక్తుణి చేసిన రాజమాతవై...
పరవశించావు
నీరై...పన్నీరై...నదివై...ప్రవహించావు

నీవు కనికరిస్తే వరం
కన్నెర్రచేస్తే వరదప్రళయం

ఆదిశంకరుని నెత్తికెక్కించి
పూజించుకుంటున్నాంగా...
వందేమాతర గీతాన 'సుజలాం'గా
సాహిత్యవీధుల్లో ఘనీభవింపజేసుకున్నాంగా...
ఇంక నీవేమైపోతే మాకేం?



ఉన్నంతలో
భూమికి నీటి తలపాగా చుట్టాలని
ఒక కెఎల్‌రావ్ ఒక విశ్వేశ్వరయ్యా అభినవ
భగీరథులయ్యారు
అయినా ఏం లాభం...
బంగారుగుడ్ల బాతుల్ని కోసుకుతినే యావలో
మా కొమ్మల్ని మేమే నరుక్కుంటున్నవాళ్ళం
పచ్చని చెట్లనూ, పర్యావరణాల్నీ, రుతుపవనాల్నీ
ఎండబెట్టుకున్నవాళ్ళం
రాజకీయాధిపత్యాలకోసం నీటినే భగ్గున
మండిస్తున్నవాళ్ళం

అందుకే
కొన్నిచోట్ల నీరు కంటే కన్నీరే ఎక్కువ
అన్నిచోట్లా క్షేమం కంటే క్షామమే ఎక్కువ
ఇప్పుడు నీ జాడ కోసం మేమంతా ఒళ్ళంతా
కళ్ళుజేసుకుని
అపర దుర్భిణీలవుతున్నాం.

-ఉదయ శంకర్

ప్రదర్శన పలువుర్ని ఆకట్టుకుంది. 1922లలో పల్నాటి సీమ ప్రాంతానికి చెందిన కన్నెగంటి హనుమంతు బ్రిటీష్ పాలకుల పెత్తందారీతనానికి వ్యతిరేకంగా జరిపిన పోరాటగాథ దీని కథావస్తువు. అడవిలో పశువులు మేపినదానికి కట్టే పన్ను 'పుల్లరి'. మన దేశంలో మనదైన అడవిలోని గడ్డిపై బ్రిటీష్‌వాడి పెత్తనమేమిటని హనుమంతు ప్రశ్నించాడు. తోటి రైతులందర్నీ కూడగట్టాడు. కలెక్టర్ రూథర్‌ఫర్డ్‌ని ఎదురించాడు. రూథర్‌ఫర్డ్ కుయుక్తులకు, వారి తుపాకులకు బలయ్యాడు. ఈ చారిత్రక గాథను రంగస్థల మెక్కించారు. నటీనటులు కూలీనాలీ చేసుకుంటూ, రాత్రిసమయాల్లో నేర్చుకుని వేసిన వారి పట్టుదల ముందు నటనాప్రతిభా చర్చలు ఎంత మాత్రమూ రావు. ఆ నాటకంలో భాగంగా సన్నివేశంలో ఇమిడ్చి చూపిన కోటప్ప తిరణాల జాతర, పీర్ల జాతరలు నాటకానికి ఎంతో సజీవతను తెచ్చాయి. ఆ నాటకంలోని దోషాలేవన్నా వున్నాయంటే అవి దర్శక రచయితలదే. కానీ...నిజాయితీగా, నిర్మలమైన పసిహృదయంతో నటించిన ఆ గ్రామవాసులది కాదు. రవీంద్రభారతి వేదిక ఈ స్క్రిప్టుకి ఓ మంచి నిండుతనాన్నిచ్చింది.

జలదంకి సుధాకర్ రచించిన 'గాలి గోపురం" ప్రదర్శన ఆలోచనావిధానంలోనే కాక, కథాసంవిధానంలోనూ, సాంకేతికపరంగా కూడా బాగుంది. సురభి కళారంగపు టెక్నిక్‌లను కూడా ఉపయోగించుకున్నారు. ప్రతీ దృశ్యం ప్రతీ పాత్ర సంభాషణాపరంగా ఆయా పాత్రల ఉన్నత వ్యక్తిత్వానికి అద్దం పడుతూ సాగింది. ప్రముఖ కథారచయిత రావిశాస్త్రి రచించిన 'చీమలు' కథాంశాన్ని నాటకంగా మలిచి గోదావరి జిల్లాల ప్రజానాట్యమండలి ప్రదర్శించింది. బలవంతమైన సర్పం చలిచీమల చేత చిక్కి చావదా అన్న సుమతి శతకం స్ఫూర్తి దీని అంతర్గత సందేశం. సాదాసీదాగా ఎట్టి రంగస్థల హంగులూ లేకుండా సందేశాత్మకంగా సాగిందీ నాటకం. నెల్లూరు జిల్లా కళాకారులు ప్రదర్శించిన 'భావిభారతం' నాటకం ప్రేక్షకుల్ని ఆలోచింపజేసింది. పురాణగాథల మాటున కింది కులాల శక్తిసామర్థ్యాలపై సాగిన దాడి-అణచివేతలకు నాటకరూపం ఇది. ద్రోణుడి చేతిలో ఏకలవ్యుడి దుస్థితి, రాముడి చేతిలో శంభుకుడు, పరశురాముడి చేతిలో తల్లి రేణుక, అక్బర్ పాదుషా చేతిలో అనార్కలీలు హతమయిన తీరు ప్రేక్షకుల మదిలో పురాణాలపై చర్చ రేపింది. తనికెళ్ల భరణి రచించిన 'గోగ్రహణం'తో పాటు 'హోలికులూ సేమమా' నాటకాలు కూడా ప్రదర్శించారు.

ప్రొసీనియం రంగస్థలంపై ప్రజానాట్య మండలి అభినయం పునఃప్రారంభించింది. వీధినాటకంలో సాధించిన అభివృద్ధి ఈ రంగస్థలంలో కూడా త్వరలోనే సాధిస్తుందని తప్పక ఆశించవచ్చు. ☆



భావిభారతం నాటకంలో దృశ్యం

తన పాదం తనే మోస్తూ

కిటికీ కంటికి
నా కళ్ళు అనుసంధించాక
గవాక్షం ఊపిరి పోసుకుంది
ఇప్పుడు దానికి దూరదృష్టీలేదు
హ్రస్వ దృష్టీలేదు
విశాలదృష్టి
విమర్శనా దృష్టి
విప్లవాత్మక దృష్టి
ద్రవీభవం నుండి
ఘనీభవం వరకు
దృశ్యం ఒక ప్రహేళిక!
నడకలు సాగుతుంటాయి
దౌర్జన్యంగా దోపిడీగా
దీనంగా
వామనుడు మూడోపాదం కోసం
స్థలం వెతుకుతూ
పీడితుడు తన పాదం
తన నెత్తిపై మోస్తూ
చూపులు సాగుతుంటాయి
క్రోధంగా రౌద్రంగా



వేదనగా మిణుగురులు
వెలుగులు పంచుతూ
పిచ్చుకలపై
వజ్రాయుధాలు విసురుతూ
చేతలు సాగుతుంటాయి
కర్కశంగా కాఠిన్యంగా
కారుణ్యంగా
ఇసుకను పిండి
నూనెను తీస్తూ
శిల్పించిన చేతుల్ని
శిల్పాల ముందే ఖండిస్తూ
కూడికలు తీసివేతలు
గుణకారాలు భాగహారాలై
పెద్దచేపకు చిన్నచేప
ఖడ్గానికి కలం బలౌతూ
వేల కాళ్ళ నడకల్ని
వేలకళ్ళ చూపుల్ని
వేల చేతుల చేష్టల్ని
ఒక రాజ్యాంగేతర శక్తి
నియంత్రిస్తూ

-అడిగోపుల వెంకటరత్నమ్

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

ఇంటీరియర్ ఆర్డర్‌తో ఉద్యోగం వస్తుందా?

నా తండ్రి గారు కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో అటెండర్‌గా పని చేయుచూ 3.11.2003న చనిపోయినాడు. లీగల్‌హైర్ తదితర అన్ని సర్టిఫికెట్స్‌ను తీసుకొని నేను నా తండ్రి ఉద్యోగమునకు ధరఖాస్తు చేసికొన్నాను. అయితే ఇదివరకే వేరొకరితో వివాహమైన ఒక ఇల్లీగల్ వుమెన్ 'డబ్బుకోసం' జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో కేసు వేసింది. తగిన ఆధారాలు లేక గత 6 నెలలుగా ఆర్గ్యుమెంట్స్‌కు ఒప్పుకోవడం లేదు. వాయిదాలు వేయిస్తూ వుంది. ఇలాంటి పరిస్థితులలో నాకు ఉద్యోగం ఇవ్వడం లేదు. నేను హైకోర్టు నుంచి ఇన్‌టీరియర్ ఆర్డర్‌తో ఉద్యోగం పొందవచ్చా? సలహా ఇవ్వగలరు.

ఎం.ఎస్. బాబు,
గుంటూరు.

జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో దావా నడుస్తున్నందున అధికారులు మీకు ఉద్యోగం ఇవ్వడంలో అది తేలేవరకు ఆగాలనే ఉండవచ్చు. మీ న్యాయవాదిగారిని కలసి దావా త్వరగా అయేటట్లు చూసుకోగలరు. అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌లో అప్లికేషన్ వేయవచ్చు. కాని అక్కడ అంత త్వరగా వేయలేకపోయారు. కాబట్టి మీరు ఆ దావానే త్వరగా అయ్యేటట్లు చూసుకోండి.

భరణం-వారసత్వం-హక్కులు

ఇంటిలో ఎవరు అడదిక్కులేరని పెద్దవాళ్ళు పట్టుబట్టి మరో వివాహం చేసారు. నా మొదటి భార్య నా ఇద్దరు మగపిల్లలతో సహా వెళ్ళిపోయింది. తరువాత కోర్టులో భరణం కేసువేసి 10సంవత్సరములనుండి ప్రతినెల 1500 రూపాయలు భరణం పొందుచున్నది. రెండవ భార్యకు ఇద్దరు ఆడపిల్లలు. నేను ఒక బ్యాంక్ వుద్యోగిని. కోర్టులో విడాకులు మంజూరు చేయడం ఆలస్యం అయినందున రెండవ భార్యపిల్లలకు ఏమైన న్యాయపరంగా భవిషత్తులో ఇబ్బందులు వస్తాయా? మొదటి భార్యపిల్లలు మేజర్ అయినారు. ప్రైవేట్‌గా పనిచేయుచున్నారు. కోర్టులో భరణం కేసు రద్దు అవుతుందా? సలహా ఇవ్వగలరు.

శంకర్
గౌలిగూడ, హైదరాబాద్

మొదటి భార్య పిల్లలకు, రెండవభార్య పిల్లలకు వారసత్వంలో సమాన హక్కు ఉంటుంది. మొదటి భార్య పిల్లలు 'మేజర్' అయితే మీరు పిటిషన్ వేసి వారికి చెల్లించే భరణం రద్దుచేసుకోవచ్చు. మీ భార్యకు మాత్రం భరణం చెల్లించాల్సి ఉంటుంది. మీ భార్య విడాకులకి, పిల్లల వారసత్వానికి ఎలాంటి సంబంధం ఉండదు. అందరూ హక్కుదార్లే అవుతారు. మీ స్వార్జితాన్ని మీ ఇష్టప్రకారం చేసుకోవచ్చు.

సర్వహక్కుదారు మీరే

నా వయస్సు 72సం॥లు. మాకు యే విధమైన సంతానము లేదు. నా భార్య ఇటీవలే మరణించింది. ఆమె పేర రెండెకరాల మాగాణి భూమి, పట్టణములో రెండు ఇండ్లు, బ్యాంకు, పోస్టాఫీసుల్లో పైకం ఉంది. ఆమెకు ముగ్గురు సోదరులున్నారు. వారిలో యిద్దరికి సంతానము కలదు. నాకు ముగ్గురు సోదరులు గలరు. వారికి సంతానం గలదు. ఈ సొత్తులన్ని మేము కష్టించి సంపాదించుకున్న ఆస్తులు మాత్రమే. ఆ సొత్తులు ఆమెకుగాని నాకుగాని యిచ్చినవి కావు. స్వీయార్జితము. ఈ సొత్తులు ఎవరికి వ్రాసి యివ్వలేదు. దత్తత మొదలగునవి చేయలేదు. ఈ సొత్తులపైన నాకు అధికారము గలదా? అలా కాకున్న ఎవరికి అధికారముంటుంది. న్యాయసలహా యివ్వగలరు.

యాల రమణయ్య,
సత్తెనపల్లె.

మీ భార్యపేరిట ఉన్న ఆస్తులకు సర్వహక్కులు నీకే చెందగలవు. దీనిమీద ఎవరికీ అధికారం ఉండబోదు. మీరే అట్టి ఆస్తులకు సర్వహక్కుదారు. మీ బావమరుదలకు గాని, వారి పిల్లలకుగాని ఎటువంటి హక్కు ఉండదు. మీ ఇష్టమొచ్చిన వారికి మీరు బహుమానంగా ఇచ్చుకోవచ్చు లేదా అమ్ముకోవచ్చు.

ఉద్యోగికి శిక్షపడితే...?

ప్రభుత్వ ఉద్యోగులు ఏదైనా కేసులో ఇరికితే ఏట్లా! ఒక వేళ జైలు శిక్షపడితే ఏట్లా! శిక్షాకాలం తరువాత ఆ ఉద్యోగం చేయవచ్చా?

కట్టా రవికుమార్
ఖమ్మం.

కేసులో ఉద్యోగస్థుల పేరు ఉంటే ముందస్తు బెయిల్ తీసుకోవాలి లేదా సరెండర్ మరియు బెయిల్ తీసుకోవాలి. 48గంటలపాటు (జుడిషియల్ రిమాండ్స్) జైల్లో ఉంటే సస్పెండ్ చేయడం జరుగుతుంది. శిక్ష పడకుంటే మళ్లీ డ్యూటీలో చేరవచ్చు శిక్షపడితే ఉద్యోగం నుండి తొలగించబడుతారు. శిక్ష పడితే అప్పీలు చేసుకోవాలి. అప్పటికి అప్పీలులో కేసు కొట్టివేయబడితే టర్మినేషన్‌ని 'రివోక్' మళ్లీ ఉద్యోగం ఇవ్వమని కోరవచ్చు.

క్యారెట్ హల్వా

కావలసిన వస్తువులు:

క్యారెట్లు	:	250 గ్రాములు
బొంబాయి రవ్వ	:	150 గ్రాములు
నెయ్యి	:	250 గ్రాములు
పాలు	:	అర లీటరు
పంచదార	:	300 గ్రాములు
జీడిపప్పు, కిస్‌మిస్	:	తగినన్ని
కోవా	:	ఒక కప్పు
యాలకులు	:	నాలుగు

తయారుచేసే విధానం: క్యారెట్లు సన్నగా తురుముకోవాలి. బొంబాయిరవ్వ బాండీలో దోరగా వేయించాలి. నెయ్యిలో జీడిపప్పు, కిస్‌మిస్ వేయించుకుని సిద్ధం చేసుకోవాలి. నేతిలోనే క్యారెట్ తురుము కూడా వేయించి, దానిలో పాలు పోసి అది దగ్గరగా అయ్యేంతవరకూ ఉడకనివ్వాలి. పంచదార పోసి కలియబెట్టాలి. లేత పాకంగా వచ్చాక కోవా, యాలకుల పొడి వేసి కలియబెట్టాలి. ఆ వంటకాన్ని వేరే గిన్నెలోకి మార్చుకుని, వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్ అలంకరించాలి.

వెజ్ బజ్జీలు

కావలసిన వస్తువులు:

శనగపిండి	:	రెండు కప్పులు (250గ్రాములు)
క్యారెట్	:	50 గ్రాములు
ఆలుగడ్డ	:	50 గ్రాములు
బీన్స్	:	50గ్రాములు
పచ్చిమిర్చి	:	తగినంత
కొత్తిమీర	:	ఒక కట్ట
అల్లం, వెల్లుల్లి పేస్ట్	:	ఒక టీ స్పూన్
జీలకర్ర	:	ఒక టీ స్పూన్
మీగడ పెరుగు	:	ఒక కప్పు
నిమ్మ ఉప్పు	:	ఒక టీ స్పూన్
నూనె	:	పావు కిలో

తయారుచేసే విధానం:

క్యారెట్, బీన్స్ సన్నగా తరిగి అట్టే పెట్టుకోవాలి. కొద్దిగా ఉడికించిన ఆలుగడ్డల్ని సన్నగా తరగాలి. అల్లం, కొత్తిమీర, జీలకర్ర ముద్దగా నూరి సిద్ధంగా ఉంచుకోవాలి. శనగపిండిలో క్యారెట్, బీన్స్, ఆలు ముక్కలతో పాటు మీగడ పెరుగు కలిపి బజ్జీల పిండిలాగా కలపాలి. చిటికెడు కారం, తగినంత ఉప్పు వేయాలి. అన్నీ కలిపిన శనగపిండి ముద్దను మనకు కావాల్సిన ఆకారంలో బజ్జీలులాగా కాగిన నూనెలో వేయించాలి. దోరగా వేగాక నూనెను పీల్చే పేపరుపై వేయాలి. చట్నీతో గానీ, టమోటా సాస్‌తో గానీ తింటే రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం.

పంపినవారు: టి అనూరాధ, కూకట్‌పల్లి, హైదరాబాద్

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్
- కొత్త కోర్సుల వివరాలు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి.న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'మాథ్స్ స్కిల్స్'
- పోటీ పరీక్షల మెటీరియల్, మోడల్ పేపర్స్
- కెరీర్ గైడెన్స్
- ప్రతివారం ఓ ప్రత్యేక సమాచారం
- 'వ్యక్తిత్వవికాసం'

దీపిక

చందాదారులుగా చేరండి
సమాచారం
మీ ముంగిట నిలుస్తుంది

ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే
ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక

అమూల్యమైన సమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు

సంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ.150లు, పోస్టు ద్వారా రూ.160లు
అర్థసంవత్సర చందా : ఏజెంటు ద్వారా రు.80లు, పోస్టుద్వారా రూ.85లు
మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ./డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్. ఫోన్: 276645420, 27663761
మేనేజర్: 27673787, ఫ్యాక్స్: 2763921.
Website: www.prajasakti.com, e-mail: prajasakti@hotmail.com